సంపుటి 34 సంచిక 113 జనవరి 2019

పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి



## విషయ సూచిక

సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి........ 2

సెక్రెటరీ రిపోర్ట్ – రమేష్ మన్నె........ 3

## శీర్షికలు

సాయితో సాయి బా.ని.స. – త్యాగరాజు ఆత్రేయపురపు ........ 6

శ్రీ సత్యనారాయణవ్రత కథారహస్యం – మధు మద్దాలి........ 8

తెలుగు వ్యాకరణం – కట్టుపల్లి ప్రసాద్........ 14

చిలకమర్తివారి ఛలోక్తి........ 20

సంగీతనాదామృతం - పద్మ మల్లెల........ 21

జీవితమే సఫలం - విజయ గొల్లపూడి ........ 24

రంగవల్లులు - శ్రీదేవి పెయ్యేటి........ 31

వరదా వరదా - పెయ్యేటి రంగారావు ........ 32

సీరియల్ భయం - శ్రీదేవి పెయ్యేటి ........ 35

**Telugu Association Inc.**
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి!

email: vahini@sydneytelugu.org

| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | వెబ్ అడ్మిన్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి | అపర్ణ సుసర్ల |

# సంపాదకీయం

జనవరి 2019 సంవత్సర శుభాకాంక్షలతో వాహిని మాసపత్రిక మీ ముందుంచుతున్నాము. మన తెలుగువారంతా విహారయాత్రలు ముగించుకుని మళ్ళీ మన ఆస్ట్రేలియా ఖండానికి క్షేమంగా చేరుకుంటూ ఉంటారనుకుంటున్నాము. మీ అందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు.

ప్రస్తుతం సిడ్నీ లో ఉష్ణతాపం తీవ్రంగా ఉంది. మధ్యమధ్యలో చిరుజల్లులు కొంత ఉపశమనాన్ని ఇస్తున్నాయి. వాతావరణానికి అనుకూలంగా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఆనందంగా విలసిల్లాలని మా ఆకాంక్ష. ఎందుకంటే ఆరోగ్యమే మహాభాగ్యం కదా!

వాహిని మాసపత్రిక మీ ముందుకు తీసుకురావటం ఒక్కరివల్ల కానేకాదు. అందరి సమిష్టి కృషి ఫలితంగానే ప్రతి నెల వెలువడుతోంది.

ఉన్నత విలువలతో, సృజనాత్మకతను మేళవించి అందరికీ ఉపయుక్తంగా తీర్చిదిద్దాలనే ప్రయత్నం. మన తెలుగుతేజాలు మీ కలాన్ని కాస్తంత కదిపి మీ రచనలు ఈ 2019 సంవత్సరం నుంచి అందించమని సవినయంగా కోరుతున్నాను. మన తెలుగు భాషలో కమనీయమైన కావ్యాలు, సాహిత్య ప్రక్రియలు, సొగసులు, చమత్కారాలు ఎన్నో, ఎన్నెన్నో. ఒక్కొక్కటిగా ఈ వాహిని మాసపత్రిక ద్వారా పంచుకుందాము. ఈ నేపథ్యంలో మీకు శ్రీ కట్టుపల్లి ప్రసాద్ గారు అందిస్తున్న ఛందస్సు వచ్చే ఫిబ్రవరి తో ముగియనున్నది. ఒక్కసారి మీరంతా ఇప్పటివరకు అయిన ఛందస్సు చదవండి, చదివించండి. సాహిత్యంలో పద్యరత్నాలను క్షుణ్ణంగా అధ్యనం కావించండి.

ప్రస్తుతానికి వాహిని మాసపత్రిక పుటలను అలా అలా తిరగేస్తూ మీ సమయాన్ని కేటాయించండి.

ఈ ఆంగ్ల సంవత్సరంలో మీ ఆశయాలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ...

మీ శ్రేయోభిలాషి,

విజయ గొల్లపూడి 0438293687

vahini@sydneytelugu.org

## ఎక్జిక్యుటివ్ కమిటీ


ప్రెసిడెంట్: సతీష్ వరదరాజు
0408 469 758


వైస్ ప్రెసిడెంట్: శ్రీ మధు బైరెడ్డి
0425 209 397


సెక్రెటరీ: రమేష్ మన్నె
0401 507 409


ట్రెసరర్:మూర్తి ఓలేటి
0402 137 475


కమిటీ మెంబర్: నరసింహారావు పెద్దాడ
0456 226 000


కమిటీ మెంబర్: మోహన్ కుమార్ పరస్సు 0419 219 526


కమిటీ మెంబర్: హరిబాబు కొల్లూరి
0425 291 032

## సబ్ కమిటీలు


వాణి కన్వీనర్ : సారధి మోటమర్రి
0430 002 130


వాహిని ఎడిటర్:
విజయ గొల్లపూడి 0438 293 687


తెలుగు స్కూల్ కోఆర్డినేటర్
మల్లిక్ రాచకొండ 0431 680 092


వనితా మండలి కోఆర్డినేటర్
శోభ వెన్నలకంటి - 8901 3636


వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల
0400 031 546


సిడ్నీ తెలుగు సీనియర్స్ కోఆర్డినేటర్
రవి సీతంరాజు

## UIA మెంబర్


శ్రీని పిల్లమఱ్ఱి
0452 025 666

## ఫైనాన్సియల్ అడ్వైసరి కమిటీ (FAC)


మూర్తి పోతుకూచి


శ్రీనాధ్ ఖండవల్లి


సుందరం రాచకొండ


ఆడిటర్
మధు వెన్నెలకంటి


పబ్లిక్ ఆఫీసర్
రవి సీతంరాజు

# SECRETARY REPORT

Dear respected STA members,

Welcome to the December edition of the Secretary's Report.

The New Year has just arrived and, for many, this involves a continuation of holiday celebrations from December. As usual, this means that a lot more vehicles are on the road, increasing the chance of accidents. So please be patient and take extra care in these holidays.

For those travelling, visiting friends and family, enjoying the last few days of their holidays or for those returning back to work and all, STA EC wishes all of you a very happy, safe, prosperous and healthy New Year.

**2019 UGADI CELEBRATIONS**

The executive committee has started preparations for our 26th Ugadi celebrations. This year, Ugadi celebrations event will be held on **13th April 2019**. Please kindly mark your calendars for this exciting event.

As always this year, we are working with Telugu Associations across Australia to bring quality programs with possible minimum costs. We are in process of finalising artists and guests, We are also trying to bring more singers, comedians and other entertainers to this event; we will update all these details in future STA correspondence, in other mediums such as STA face book, Telugu Vani Radio, Vahini, and Secretary's report.

Without local talent, our event is incomplete. We are requesting that all of you, including your families and friends to participate and showcase your talent. It is an excellent opportunity and if you would like show your talent, please feel free to contact me on **secretary@sydneytelugu.org** or on **ec@sydneytelugu.org**.

**VOLUNTEERS**

Volunteers are the backbone of any successful event. We are looking for many volunteers to participate in the lead up to the event and on the event day and after. We request that any interested members to contact EC members for more details and registration.

**SPONSORS**

Without sponsors it is very hard to run any voluntary organisation. I am requesting all life members to take part in this event. For more details, please contact me or any EC member for more details.

**Upcoming Activities:**

1) Ugadi

Date: 13/04/2019

Time: 5:00-10:30pm

Venue: TBC

Best Regards,

Ramesh Manne

Secretary, Sydney Telugu Association

❖❖❖❖❖




❖❖❖❖❖

**Vahini**

**వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు పంపవలసిన**

**మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in

*Telugu*,

The second largest language spoken in India

❖❖❖❖❖

## విజ్ఞప్తి

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.


❖❖❖❖❖




❖❖❖❖❖

# సాయితో సాయిబానిస అనుభవాలు – 9

**అనువాదం శ్రీ త్యాగరాజు ఆత్రేయపురపు, హైద్రాబాద్**



బాబాతో సాయి బానిస అనుభవాలు - 9

బాబా తన భక్తులకిచ్చిన హామీల గురించి 'సాయి సచ్చరిత్ర 15 వ అధ్యాయం లో ప్రముఖంగా చెప్పబడింది. ఒక్కసారి కనక ఎవరినైనా బాబా తన భక్తునిగా స్వీకరిస్తే, అతను సప్త సముద్రాల అవతల ఎక్కడ ఉన్నా సరే, బాబా ఆ భక్తునివెంట నీడలా నిరంతరం అనుసరిస్తూ ఉంటారు. ఒక సాయి భక్తునిగా నేనీ విషయాన్ని బలపరుస్తూ, నా జీవితం లో జరిగిన ఒక సంఘటనను మీకు తెలియపరుస్తున్నాను.

నా విదేశ యాత్ర మొదటి అనుభవంలో దక్షిణ కొరియా ప్రయాణం గురించి వివరించాను. దానిని మరొక్కసారి తిరిగి గుర్తుకు తెచ్చుకుందాము. ఇప్పుడు నేను చెప్పబోయే ఈ సంఘటన దానికి అనుబంధం. 06.05.1991 చాంగ్వాన్ పట్టణములోని హొటలు గదిలోకి ప్రవేశించగానె ఒక పెద్ద పరిమాణంలో ఉన్నకందిరీగ ఒకటి నా చుట్టూ రెండు సార్లు ప్రదక్షిణాలు చేసి గది ద్వారమునుండి బయటికి వెళ్ళిపోయింది. నేను సియోల్ నుండి పుసాన్ పట్టణానికి విమానములో ప్రయాణిస్తూ "బాబా నేను చాంగ్వాన్ పట్టణానికి చేరే సమయానికి నాకంటె ముందుగా నీవక్కడకు చేరుకుని నాకు దర్శనమివ్వగలవా" అని బాబాని కోరాను. ఇప్పుడు ఈ గది తలుపు తెరవగానే నా చుట్టూ రెండు ప్రదక్షిణాలు చేసి గది ద్వారముగుండా బయటకు వెళ్ళిన కందిరీగ, బాబా కాదు కదా అని ఆలోచించాను. ఇదంతా నా భ్రమ అని భావించాను. ఈ విషయము ఒక సాధారణ వ్యక్తికి హాస్యాస్పదముగా అనిపించవచ్చును. సాయి భక్తులకి మాత్రము ఇందులో నిజం ఉన్నదని గ్రహించగలరు. సాయి సచ్చరిత్ర 46 వ అధ్యాయంలో యిటువంటి సంఘటన వివరింపబడింది. నానా

సాహెబ్ చందోర్కర్, కాకా సాహెబ్ దీక్షిత్ లు యిద్దరూ బాబాను తమతోపాటు నాగపూరు, గ్వాలియర్, గయ పట్టణాలకి రమ్మని కోరినప్పుడు బాబా అన్న మాటలను (46 వ అధ్యాయం 379 పేజీ) ఒక్కసారి గుర్తు చేసుకుందాము. "నా తరఫున మీరు శ్యామాను మీతో తీసుకుని వెళ్ళండి. కాశీ ప్రయాగ యాత్రలు ముగియుసరికి నేను శ్యామాకంటే ముందుగానే అతనిని గయలో కలుసుకుంటాను. " ఈ మాటలను గుర్తుంచుకొనవలయును. ఏలనన అవి బాబా సర్వవ్యాపి అని నిరూపించును.

చాంగ్వాన్ పట్టణములో నా ఆఫీసు వ్యవహారలన్నిటినీ ముగించుకుని 16.05.1991 నాడు తిరిగి భారత దేశానికి వచ్చే ప్రయత్నంలో ఉన్నాను. 16.05.1991 తెల్లవారుజామున 5 గంటలకు నేను కాకడ ఆరతి చదవడం పూర్తి అయిన తరువాత నేను చాంగ్వాన్ పట్టణములో హోటలు గదిలో ప్రవేశించిన సమయములో (ఆరోజున 06.05.1991) నా చుట్టూ ప్రదక్షిణాలు చేసిన కందిరీగ తిరిగి మరలా కాకడ ఆరతి పూర్తయిన వెంటనే నాచుట్టూ రెండు ప్రదక్షిణాలు చేసి కిటికీ ద్వారా బయటికి వెళ్ళిపోయింది. ఈ సంఘటనకు నేను నిశ్చేష్టుడినయ్యాను. ఆనాడు శ్రీ సాయి గయలోని పాండా యింటిలో సాయి పటము రూపములో శ్యామాకు దర్శనమిచ్చి తనన్న మాటలను ఋజువు చేసుకున్నారు. చాంగ్వాన్ పట్టణము హోటలు గదిలో నా కంటి ముందుగా శ్రీ సాయి కందిరీగ రూపములో వచ్చి తిరిగి నాకంటి ముందుగా 16.05.1991 నాడు ఇండియాకు బయలుదేరారని గట్టి నమ్మకమేర్పడింది. శ్రీ సాయి అన్ని జీవులలోనూ ఉన్నారనే మాటలు నాలో ప్రతిధ్వనించాయి. సాయి సర్వవ్యాపి అని నిరూపించుకున్నారు.

జై సాయిరామ్

❖❖❖❖❖

తెలుగు వాణి వ్యాపార ప్రకటనలికి కాని, ప్రోగ్రాం గురించి మీ అభిప్రాయాన్ని కాని, తెలుగు వాణి లో పాల్గొనడానికి కాని తెలుగు వాణి కన్వీనర్ సారధి మోటమర్రి గారిని 0430 022 130 మీద గాని లేదా email vani@sydneytelugu.org ద్వారా గాని సంప్రదించండి. మీరు తెలుగు వాణిని రేడియో 98.5FM ద్వారా ప్రతి శనివారము 8:30AM నుంచి 10:30AM(AEST) వరకు వినవచ్చును. అలాగే ప్రపంచంలో ఉన్న సిడ్నీ తెలుగు వాణి శ్రోతలు ఆ సమయంలో http://www.2000fm.com/ ద్వారా వినవచ్చును.

❖❖❖❖❖

# శ్రీ సత్యనారాయణ వ్రత కథా రహస్యము

||సదాశివ సమారంభాం వ్యాస శంకర మాధ్యమం, అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం ||

||గురవే సర్వ లోకనం భిషజే భవరోగినాం, నిధయే సర్వ విద్యానాం దక్షిణామూర్తయే నమః||

||శ్రీ గురుభ్యోన్నమః||

- శ్రీ మధు మద్దాలి, సిడ్నీ



శ్రీ మాత్రే నమః శ్రీ పితృభ్యో నమః శ్రీ గురుభ్యో నమః

ఓం నమో భగవతే వాసుదేవాయా ||

*మహేశ్వరే వా జగతామధీశ్వరే జనార్దనే వా జగదంతరాత్మని /*

*న వస్తు భేద ప్రతిపత్తిరస్తి మే తథా2పి భక్తిస్తరుణేందు శేఖరే //*

(మహేశ్వరుడు జగత్తుకు ఈశ్వరుడు| జనార్దనుడు జగత్తంతా నిండివున్నాడు | ఇరువురి మధ్య భేదభావం లేనప్పటికీ భక్తి అంతా ఆ పరమేశ్వరుడి మీదే -భర్తృహరి)

ఒకానొక శుభ దినాన, కార్తీక సోమవారం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం చేయుచుండగా కలిగిన సంకల్పమే ఈ శ్రీ సత్యనారాయణ వ్రత కథా రహస్యము| నా శక్తికి మించిన కార్యమని తెలిసీ చేయుచున్న నా ప్రయత్నానికి సర్వదా ఆ పరబ్రహ్మ నాకు సహకరిస్తాడని తన కృపాకటాక్ష వీక్షణాలు నాపై ప్రసరింప చేస్తాడని, నిత్యం శివ పంచాక్షరీ మంత్ర తపస్సులో నా మనస్సు

లయం చెందాలని| నా ఈ జన్మ పరబ్రహ్మ అన్వేషణకు తదుపరి దర్శనం కొరకు మాత్రమే పరితపించాలని| మాయావరణం నుంచి విముక్తి ప్రసాదించాలని| ఆ ఆదిమధ్యాంత రహితుడిని ప్రార్థిస్తున్నాను||

*ఆకాశాత్పతితం తోయం సాగరం ప్రతిగచ్ఛతి /*

*సర్వ దేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి//*

ఆకాశము నుంచి జాలువారిన ప్రతి నీటి చుక్కా సాగరానికి ఎట్లు చేరునో అట్లే ముక్కోటి దేవతాలలో ఎవరికి నమస్కరించినా అది పరబ్రహ్మకే చేరును|| అంటే ఏ దేవతకి నమస్కరించిన, ఏ వ్రతము ఆచరించినా ఆది పరబ్రహ్మ కోసమే అని భావించాలి|

*యాంయాంతనుం సమాశ్రిత్య శ్రద్ధయార్చితు మిహతే/*

*తత్రతత్రాచలాం భక్తింతామేవ విదధామ్యహం//*

ఎవడే మూర్తిని శ్రద్ధా భక్తులతో పూజించునో వానికామూర్తి యందే నేనుప్రసన్నుడగుచున్నాను||

ఆర్ష ధర్మ సంప్రదాయములో ఎన్నో పూజలు వ్రతాలు చెప్పబడినవి| ఒక్కొక్క పూజా లేక వ్రత మహిమ, విశిష్టత దానిది| ఒకటి గొప్ప అని ఇంకొకటి తక్కువ అని ఎవ్వరూ చెప్పలేదు చెప్పలేరు కూడా|

*జంతూనాం నరజన్మ దుర్లభం//*

దూర్లభమైన నర జన్మ పొందినప్పుడు పరబ్రహ్మ అన్వేషణకు సమయాన్ని వెచ్చించాలి| ఇందుకు ఎన్నో మార్గాలు| ఆ మార్గాలలో వ్రతం ఒకటి| ప్రధానంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం| వ్రతములు ఎందుకు ఆచరించాలి, వాటి వల్ల మనకి కలుగు లాభమేమిటి, శ్రీ సత్యనారాయణ వ్రత కథల అర్థమేమిటి అన్నది ప్రస్తుత విషయం|

వ్రత కథలకి మళ్లీ వివరణ ఈ కాలం యువతీయువకులకు చాలా అవసరం| మన ప్రాచీనులు క్లుప్తంగా అలౌకికమైన విషయాన్ని చిన్న లౌకికమైన కథల రూపంలో రూపొందించి మనకు అందించారు| కానీ నేటితరం వారు లౌకికాన్ని మాత్రమే స్వీకరించి మన సనాతన ధర్మాన్ని వెక్కిరిస్తున్నారు| ఇది శొచనీయం, ఈ రచనకు మూలకారణం|

శ్రీ సత్యనారాయణ స్వామి వారి పూజ పురుషసూక్త విధానముగా చేస్తారు| స్వామి వారిని ఆవాహన చేసి, అంగాంగము అర్చించి, నైవేద్యాదులు సమర్పించిన తరువాత వ్రత కథలు ప్రారంభమౌతాయి| ఒక్కొక్క కథ ఒక్కొక్క ముఖ్య విషయాన్ని ప్రకటిస్తుంది| అటువంటి ముఖ్యవిషయాలు మాత్రమే ఈ క్రింద చెర్చించటం జరిగినది|

**మొదటి అధ్యాయం:**

సూత మహాముని ని సౌనుకాది మునులు, ఎటువంటి వ్రతము లేక తపస్సు చేస్తే కోరిన ఫలములు సిద్ధించునో ఆ విధానము తెలుపుమనీ ప్రాధింపగా, సూత మహాముని నారదుడు విష్ణు దేవుడను ప్రాధించిన విధానముని తెలిపెను| ఇక్కడ "కోరిన ఫలములు సిద్ధించునో" అని అడిగిన వారు తపస్సంపన్నులు| మరి వారు ఎటువంటి ఫలముల గురించి అడుగుతారు? పిల్ల పెళ్లి గురించా? లేక కొడుకు ఉద్యోగం గురించా? తాపసులు ముముక్షువులు, వారు మొక్షం గురించి మాత్రమే ప్రశ్నిస్తారు| పరబ్రహ్మను దర్శించటానికి అలౌకికమైన మార్గమును ఉపదేశించమని దాని అర్థం| ఇక్కడ ముఖ్యవిషయం మనం చేసే ప్రతి పూజా, వ్రతం, తపస్సు అన్ని మోక్షమార్గానికి సాధనాలే|

నారదుడు శ్రీమన్నారాయుడిని, మానవులు నానాయోనులందు (మానవ పశుపక్ష్యాదులు)
జన్మించి కష్టములు అనుభవించుచున్నారు వారికి కష్టములు ఎట్లు తొలుగును అని ప్రార్థింప, కమలనాభుడు పునరావృత్తిర హిత మార్గమైన ఈ వ్రతమును ఉపదేశించెను| ఐతే ఈ వ్రతం లౌకిక కోరికలైన ధనార్జన, సంతనం మొదలైన వాటి గురించి ఆ చరించకూడదా అంటే, వారి వారి కర్మానుసారం వారికి ఎంత రావలసివుందో అది మాత్రమే సంకల్పించాలి| నా కర్మానుసారం రావలసింది ఎలాగూ వస్తుంది, మరి మళ్లీ దానినే ఎందుకు సంకల్పించాలి? అనే ప్రశ్న ఉదయించవచు | మనస్సుది కాంక్షించె తత్వం, ఒక కోరిక తీరకముందే మరొక కోరిక జారీ చెస్తుంది| కాబట్టి కోరికలు ధర్మబద్ధంగానూ, మనస్సు నొచ్చుకోకుండానూ అంటే కోరికను సంకల్పించి (మనస్సును శాంత పరిచి), ధర్మబద్ధం గా ఉండేలా చూసుకోవాలి|

ఇంకా శ్రీహరి ఇట్లు చెప్పెను, స్వర్గాది లోకాలలో ఈ వ్రతం ఆచరించటం దుర్లభం, ఆచరించినయెడల సకలైశ్వర్యములు పొంది అంత్యమున మోక్షమును పొందుదురు| స్వధర్మానుష్టానాన్ని విడిచి, కోరికల ఊబిలో కూరుకుపోతూ, ధర్మ పతనానికి ప్రేరేరిం పబడుతున్న కలియుగంలొ కూడా ఆచరించగలుగుతున్న శ్రీ సత్యన్నారాయణ వ్రతం స్వర్గాది లోకాలలో దుర్లభం అని మాధ వుడు ఎలా చెప్పాడు? వ్రతం అనే పదానికి సంస్కృతార్థం "***వ్రత్యతే అన్నాదిక మనేనేతి వ్రతం***" -
అన్నాదులు దీనిచేత విడువబడును. అంటే వ్రతం విషయవాంఛలనుంచి మనస్సును దైవం మీదకు మలర్చుటకు ఒక సాధ నం. వ్రతానికి బ్రహ్మచర్యమ్ కూడా చాలా అవసరం. ఎందువలన అంటే"***బ్రహ్మచర్య ప్రతిష్టాయాం వీర్యలాభః***" -
బ్రహ్మచర్య ప్రతిష్ట వలన శక్తిసామర్ధ్యాలు కలుగును| ఎవరికి? మనస్సుకే. మనస్సుకి శక్తిసామర్ధ్యాలు కలుగుట వలన సంక ల్ప సిద్ది లభిస్తుంది| ఎటువంటి సంకల్పంతొ వ్రతం ఆచరిస్తున్నామొ ఆ సాత్విక కోరికలు తీరుటకు బ్రహ్మచర్యం మరియు మిత సాత్వికాహారం లేక ఉపవాసం ముఖ్యమైన నియమాలు| క్లుప్తంగా వ్రతాచరణ రోజు లేక రోజులు, సర్పం కుబుసాన్ని విడిచి వె ళ్లినట్టు, మనస్సు విషయవాంఛలని విడిచి, బ్రహ్మచర్యం తో పరబ్రహ్మమీదే మనస్సును లగ్నంచేయ్యాలి, కలికాలంలొ ఇంతటి నిష్టకు అనుకూల వాతావరణం లేదు కాబట్టి ఈ వ్రతం దుర్లభం అని అర్థం| వ్రతాన్ని ప్రయత్నించి ఆచరించటం మన పూర్వ జన్మ సుకృతం

మరి, సకలైశ్వర్యములు పొంది అంత్యమున మోక్షమును పొందుదురు, అన్నదానికి అర్థం? లౌకికమైన సకలైశ్వర్యములు పొంది, ఆ ఐశ్వర్యాన్ని దానధర్మాలు చేసినా ఉత్తర జన్మ, ఉన్నత జన్మ మాత్రమే వస్తుంది కానీ మోక్షం రాదు| ఇక్కడ ఐశ్వర్యా నికి అర్థం "***ఈశ్వరస్యభావ ఐశ్వర్యం***" | అంటే, ఈశ్వరుడియందు ధ్యానమే ఐశ్వర్యం, ఈశ్వరుడు అంటే శైవ పదం కాదు, ఈశ్వ రుడు అంటే పరమాత్మా| మనస్సు ఆ పరమాత్మనే అనునిత్యం ధ్యానిస్తూ, పరమాత్మ లో లీలమవ్వాలనే కాంక్ష తప్ప మరి ఎ టువంటి కోరికా లేకుండా వుండగలిగితే అప్పుడు అంత్యమున లభించేది మొక్షం|

ఏ వ్రతానికైన అత్యంత ముఖ్యవిషయం నిశ్చల భక్తి| ఆది శంకరులు చెప్పినట్టు నిశ్చలతత్వం లభిస్తే జీవన్ముక్తులౌతారు, మరి ఆ నిశ్చలతత్వం ఎవరికి సిధించాలి? మనస్సుకే| కొలనులో నీరు కాలుషితముగావున్న లేక నూరుగులతో సుడిగుండాలు తి రుగుతూవున్న, కొలను యొక్క అడుగుభగాన్ని ఎలా చూడలేమొ, అలాగే మనస్సు విషయవాంఛలతో ఉన్నంతకాలం, మన లొనే ఉన్న పరమాత్మని దర్శించలేము| మనస్సు నిలకడగా ఉండి, భక్తి స్థిరమైనప్పుడు, లభించే ఉత్కృష్టమైన స్థితి నిశ్చ లతత్వం, అతువంటి భక్తి తో ఈ వ్రతమును ఆచరించాలి|

**రెండవ అధ్యాయం:**

పూర్వము కాశీనగరమున దరిద్ర బ్రాహ్మణుడు కష్టములు పడుట చూచి శ్రీ మహావిష్ణువు, బ్రాహ్మణప్రియుడు గాన వృధ బ్రాహ్మ ణ రూపమున దర్శనమిచ్చి దారిద్ర్యము పోవుటకు శ్రీ సత్యనారాయణ వ్రతము ఆచరించమని చెప్ప ఆ బ్రాహ్మణుడు వ్రతము ఆచరింప ఐశ్వర్యము కలిగి ఆనందముగా జీవించెను. పూర్వము కాశి నగరము పండితులకు నెలవు, అటువంటి నగరములో దరిద్ర బ్రాహ్మణుడా? అసలు బ్రాహ్మణుడు అంటె "***బ్రహ్మణి పరబ్రహ్మణి నిష్టావత్వాత్ బ్రాహ్మణః***" -

ఆ పరబ్రాహ్మ యందు ఎవరైతే నిష్టగా వుంటారొ, ఎవరికి పరబ్రాహ్మ ను తెలుసుకోవాలని జిజ్ఞాస వుంటుందొ, విషయ వాంఛల నుంచి మరలి మూముక్షు వుగా వుంటరొ, పరబ్రహ్మ లో ఐక్యం అవ్వాలన్న కోరిక ఉంటుందో, బ్రహ్మవిద్యను అభ్యాసిస్తారో, వీ రు బ్రాహ్మణులు| మరి ఇటువంటి వారికి దరిద్రం వుంటుందా? వుండనేవుండదు| దరిద్రం అంటే ఐశ్వర్యం లేమితనం, ఐశ్వర్యం అంటే "***ఈశ్వరశ్య భావ ఐశ్వర్యం***" | బ్రాహ్మణత్వాని పొంది బ్రాహ్మయందు నిష్ట లేకపోవటమే ఇక్కడ దరిద్రం |

శ్రీ హరి వృద్ధ బ్రాహ్మణ రూపం దాల్చాడట| ఇక్కడ వృద్ధత్వం వయస్సుని సూచించట్లేదు | స్వామి సాక్షాత్తూ జ్ఞాన స్వరూపు డు, వేదాంతర్గతుడు, సనాతనుడు కాన వృద్ధ రూపం లో దర్శనమిచ్చాడు | శ్రీ హరి బ్రాహ్మణ ప్రియుడట, మరి ఇక్కడ బ్రాహ్మ నత్వం జన్మతః నా లేక కర్మాతః నా? అంటేరెండునూ! కానీ జన్మతః బ్రాహ్మనత్వాన్ని పొంది గాయత్రి మంత్ర స్వరయుక్త ఉచ్చా రణ కూడా రాని వారు, కఠోర తపస్సు చే అమృత భాండాగారాన్ని పొంది చేతులార నేల పాలు చేసిన చందం వారి దురద్రుష్టా న్ని వివరిస్తుంది| బ్రహ్మణుడు తన లౌకిక కష్టాముల గురించి ఆ వృద్ధ బ్రాహ్మణ రూపవేషాధారికి విన్నవించుకున్నాడ లేక పర మాత్మ యందు పరిపూర్ణమైన ధ్యానసాధనకు వృద్ధుడిని వేడుకున్నడా? రెండవదేకావచ్చు| శ్రీ సత్యన్నారాయణ స్వామి వ్ర తం ఆచరించిన తరువాత ఆ బ్రహ్మణుడికి కష్టములు తొలిగి ఆనందముగా జీవించాడట| మరి కర్మానుసారం సంక్రమించిన దు ఖం తొలిగినట్టా? కాదు ఆ బ్రహ్మనుడు దేహతాదాప్యం వదలి, నేను వేరు, నేను ధరించిన శరీరం వేరు అన్న జ్ఞాన్నాన్ని సాక్ష త్కరించుకునాడని దాని అర్ధం| ఆ జ్ఞానోదయం కలిగిన వారు దేహపతనావస్త లోకూడా పరమాత్మ ధ్యానంలొ నిత్యానందులుగా కోటి సూర్య ప్రభలతో ప్రకాశిస్తూవుంటారు | శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ వివేకానందులు, భగవాన్ శ్రీ రమణ మహర్షి, శృంగేరి శ్రీ చంద్రశేఖర భారతి స్వామి, కంచి శ్రీ చంద్రశేఖర సరస్వతీ స్వామి మరి యెందరో సిద్ద పురుషులు ఈ కోవకు చెందినవారు

**మూడవ అధ్యాయము:**

వైశ్యుడు, స్వామి వ్రతం చేసేద అని ప్రతిజ్ఞ - ప్రతిజ్ఞ మరచిపోవుట - స్వామి శపించుట -
వైశ్యుడు, అల్లుడు కారాగారమున బంధీలగుట - లీలావతి వ్రతము ఆచరించుట - వైశ్యుడు, అల్లుడు కారాగార విముక్తి|

ఈ అధ్యాయము నుంచి మనస్సు యొక్క తత్వం గురించి చెప్పబడినది| మనస్సు తన కోరికలను సిద్ధించుకొను వరకు ఉపశ మించదు, ఆ కోరిక కొరకు ఏ కార్యానికైన సిద్ధపడుతుంది| ఇక్కడ గర్భస్త నరక ప్రస్తావన కొంత అవసరం -
బిడ్డ తల్లి గర్భంలొ తన పూర్వ జన్మ కర్మలగురించి తెలుసుకొని, ఆ పరమాత్మని సహస్ర విధాలా ప్రార్ధించి తనకి మరియొక అవకాశాన్ని కల్పించమని, ఆ జన్మ లో తాను పూర్తిగా పరమాత్మ యందు నిష్టతొ, నిత్యం స్వామి ని సేవిస్తానని, తనకు సంక్ర మించిన కర్మలను పూర్తిగా ఈ జన్మ లో అనుభవిస్తానని, తనకి పునరావృత్తి రహితాన్ని ప్రసాదించమని ఎన్నో విధాల వేడుకొ ని, ఈ మాయా ప్రపంచంలొకి అడుకువేస్తుంది| తల్లి గర్భంనుంచి బైటకు రాగానే, తాను చేసిన ప్రతిజ్ఞలన్ని మరిచిపోయి, తనని తాను పూర్తి స్వతంత్రుడిగాభావించి, మాయా మోహితులౌతారు|

ఈ అధ్యాయం లో వైశ్యకుటుంబాన్ని మనస్సు తో పోల్చవచ్చు -
సంతానం కొరకు వ్రతమునాచరిస్తానని ప్రతిజ్ఞ చేసి, మరిచిపోయి తన వ్యాపారములో (చిత్తవృత్తిలో) నిమగ్నుడైనాడు| ప్రతిజ్ఞ నెరవేర్చనందుకు శ్రీ హరి కి కోపం వచ్చి శపించెనట| పరమాత్మా శాంతస్వరూపుడు, కరుణామయుడు, నిత్యానందుడు, అటువంటివాడు తన వారిని శపించడమా? తల్లి తన బిడ్డలను శపించగలదా? మరి ఇక్కడ ఎవరు ఎవరిని శపించారు? ఒక కార్యాన్ని సంకల్పించినప్పుడు మంచి చెడుల విచక్షణ ను తెలిపే జ్ఞానమే బుద్ధి, మనస్సు అశ్వమైతే, బుద్ధి అశ్వాన్ని కళ్ళెం వేసి నడిపించెది, మరి ఆ బుద్ధి లోపిస్తే? మనస్సు గమ్యం లేని ప్రయాణం చేస్తూనే వుంటుంది| ఇక్కడ ఆ బుద్ధి మనస్సుని బంధించి, గద్దించి, ప్రతిజ్ఞ నెరవేర్చమని శాసించటమే వైశ్యుని శాపం| వైశ్యుని భార్య వ్రతమును ఆచరించుట వలన, వైశ్యుడు, అతని అల్లుడు బంధ్ధవిముక్తులైనారు -
అంటే బుద్ధి మనస్సును ప్రతిజ్ఞ నిర్వర్తింపచెసి, సక్రమమైన దైవీ మార్గంలొ నడిపిస్తున్నది అని దాని అర్థం|

**నాల్గవ అధ్యాయం**

**నాల్గవ అధ్యాయం**లొకూడ మనస్సు ప్రస్తవనే జరిగింది| మనస్సు అనే మదగజానికి మావటి అంకుశపోటు ఎప్పుడు అవసరమే| జన్మాంతర వాసనలన్ని నిక్షిప్తం చేయబడే అద్భుత భాండగారమే మనస్సు| మనము చేసే ప్రతి ఆలోచన, ప్రతి పని మనస్సు మీద ముద్ర పడుతుంది, అదే సంస్కారం| మన పురాణలు చెబుతున్నట్టు, చిత్రగుప్తుడు మన సమస్త పాప పుణ్యాలు లెఖిస్తు వుంటారట| నాకు ఆ చిత్రగుప్తుడు మన మనస్సే అని అనిపిస్తుంది| అంటే ఈ జన్మ లో అనుభవిస్తున్న మంచి చెడులు పూర్వ జన్మలొనే రచన పూర్తైదన్నమాట| కర్మక్షయం, జ్ఞానవృధి గురువు వలన మాత్రమే సాధ్యపడుతుంది|

విధి మనస్సును పరి పరి విధాల పరీక్షిస్తూవుంటుంది| మనస్సు (వైశ్యుడు) గర్వం తో తన దెగ్గర ఉన్న ధనం లేదనటం, అది సాధువు శాపం వల్ల ఆకులుగా మారటం, వైశ్యుడు (మనస్సు) తన తప్పు తెలుసుకోవటం, మనస్సు కి బుద్ధి చెపడమే అని భావించవచ్చు| కళావతి తన తండ్రి, భర్తా రాకకు ఆనందించి, తాను చేయుచున్న వ్రతము పూర్తిచేయకనే వారి వద్దకు వెళుతుండగా, పడవ సాగరమున మునిగిపోయేను| ఇక్కడ  సంసార ప్రస్తావన ముఖ్యం | సంసారం ఒక సాగరంలాంటిది, సుఖ దుఖాలు అలలుగ ఎగసిపడుతుంటాయి, ఎన్నో ఆలోచనలు సుడిగుండాలు తిరుగుతుంటయి,  తనకి సంబంధించిన, సంభందించని విషయాలను తనలోకి తీసుకుని ఆనందిస్తుంది (బాధపడుతుంది). ఇక్కడ పడవ సాగరంలొ మునిగిపొవుట అంటే, మనస్సు (కళావతి) ఎప్పుడైతే భగవంతుని (వ్రతము) నుంచి బంధాలమీదకు (నా తండ్రి, నా భర్త) మరలిందొ, మనస్సు పూర్తిగా సంసారంలొ (సాగరంలొ) మునిగిపోయిందని భావం కావచ్చు|| కనీసం వ్రతము ఆచరించేటప్పుడు ప్రతిక్షణం పరమాత్మ యందు భక్తితో చేయవలెను, సమస్తమైన సంసార విషయములను విడువవలెను|

**ఐదవ అధ్యాయము**

**ఐదవ అధ్యాయము**లో స్వామి ప్రసాదం గురించి చెప్పబడినది| రాజు గర్వముతో గొల్లలు ఇచ్చిన ప్రసాదాన్ని స్వీకరింపక కష్టములపాలయ్యను| ఎటువంటి తారతమ్యము లేకుండా ప్రసాదము ప్రసాదముగనే చుడవలెను, పరబ్రహ్మ అనుగ్రహముగనే భవించి స్వీకరించాలి| అంతే గాని ప్రసాదమున పదార్థము లేక రుచి చుచినయెడల మనస్సు పరబ్రహ్మ యందు లెనట్టే| ప్రసాద స్వీకరణ కూడా వృధా అయినటే||

అందరూ శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతమును భక్తి శ్రద్ధలతో ఆచరించి తరించాలని, సదా ఆ పరబ్రహ్మ కృపాకటాక్ష వీక్షణాలు మనపై ప్రసరించాలని నేను వేడుకుంటున్నాను|| స్వస్తి||

**గమనిక:** శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత కథ రహస్యం ఇంచుమించుగా 10 సంవత్సరాల క్రితం, అమ్మ వారి ఆశీస్సులతో అప్పటి ఎడిటర్ విజయ చావలి గారి సహకారంతో, వాహిని మాసపత్రికలో ప్రచురితమైంది. మళ్లీ ఇప్పుడు అమ్మ ఆశీస్సులతో విజయ గొల్లపూడి గారి ప్రేరణతో ప్రచురితమవుతోంది. నా తల్లి పరమేశ్వరికి సాష్టాంగ నమస్కారాలు సమర్పిస్తూ... , మాతృమూర్తులకు నమస్కరిస్తూ, మీ మధు మద్దాలి.



# తెలుగు వవ్యాకరణము (ఛందశ్శాస్త్రం)

## తెలుగు వ్యాకరణము

**- శ్రీ ప్రసాద్ కట్టుపల్లి, హైద్రాబాద్**



ఛందశ్శాస్త్రం ,.10 వ భాగము

పద్యాలు అందలి రకాలు...,

విద్యలలోపల నుత్తమ
విద్య కవిత్వంబు మఱి కవిత్వము ఛందో
వేద్యముగావునఁజెప్పెద
హృద్యంబుగఁగవిత చందమేర్పడఁగృష్ణా,,

(చందోదర్పణము,,,,,,,,అనంతామాత్యుడు)

అన్ని విద్యలలోను  కవిత్వము ఉత్తమ విద్యయని,,,ఆ కవిత్వము ఛందస్సు వలననే రంజిల్లు తున్నదని అనంతా మాత్యుడు చందో దర్పణములో తెలియ చేసినాడు,,

ఞ A,,పద్యము దాని లక్షణములు

1.సాదారణముగా నాలుగు పాదాలు కలిగి ఉండును
2.ఛందోబద్ధమై ఉంటుంది.,,పద్యనియమములు  కలిగి ఉంటుంది
3..యతి ప్రాసతో అలరారుతుంటుంది.,,,

పద్యములలోని రకములు,,,,,

1..వృత్తములు.,,,,,,

అక్షర గణములచే ఏర్పడునవి వృత్తములు,,,అనగా పద్యములోని  ప్రతి పాదములోను స్థిరమైన   లఘువులు    గురువులు కలిగి వుంటాయి,,,ఇంకా విపులంగా చెప్పుకోవాలంటే 19 అక్షరాల పద్యపాదము ఉంది అనుకుందాము,,మొదటి పాదములో మొదటి అక్షరము నుండి 19 వ అక్షరం వరకు ఏ  స్థానంలోని అక్షరం గురువుగా ఏ స్థానములోని అక్షరం  లఘువు గా ఉంటే

మిగిలిన మూడు పాదాలలోను అదే రీతిగా ఉండి మూడక్షరాల గణాలగా విడగొట్ట బడును ఇలా మూడక్షరాల గణాలుగా విడగొట్టిన పిమ్మట ఇంకా,,,1 లేదా 2 అక్షరాలు మిగిలితే అవి ఏకాక్షర గణాలు గానో ద్వ్యక్షర గణాలు గానో మిగిలి పోతాయి,,ఇలా కొన్ని కోట్ల సంఖ్యలో వృత్తాలు ఏర్పడినప్పటికీ అందులో కొన్నింటికి మాత్రమే లక్షణాలు చెప్ప బడ్డాయి.లక్షణాలు చెప్పిన వాటిలో కూడా కొన్ని మాత్రమే కావ్యాలలో వ్రాయబడ్డాయి..,వ్రాసినవాటిలోనుండి కొన్ని పద్యాలను నేను ముందు పాఠాలలో ఉదహరించాను.

యతి ప్రాస మరియు అక్షర నియమము కలిగి ఉంటాయి...

మనకు తెలిసిన ఉత్పలమాల.,,చంపకమాల.,,,శార్దూల విక్రీడితము.,,మత్తేభవిక్రీడితము,,ఇంద్రవజ్రము,,,మత్తకోకిల.,,.,,దండకము,.,మొదలైనవి వృత్తముల విభాగములోనికి వచ్చును,,,

2..జాతులు,,,,,,,

జాతులు గా ప్రసిద్ధి నొందిన పద్యములు మాత్రాగణాలచే ఏర్పడును ,,వీటియందు ఉపగణాలు కూడా వాడ బడతాయి,,,,(సూర్య ఇంద్ర చంద్ర గణాలు ఉప గణాలు)

ఒక గురువు రెండు లఘువులుగా గుర్తించబడును అనే నియమము వలన ఈ మాత్రా గణాలు ఏర్పడినాయి.

కందము,,,,ద్విపద,,,,,,మంజరీ ద్విపద,,,తరువోజ, ,అక్కరలు,,,,,రగడలు,,,,,,మొదలైనవి,,,జాతులలోనికి వస్తాయి.,,,యతి ప్రాస నియమం కలిగి ఉంటాయి.,,

3..ఉప జాతులు,,,

ఇవి కేవలము,మన తెలుగు భాషకు సంబంధించినవి, అనగా సంస్కృత భాష ప్రభావము ఏమాత్రము లేనివి.,,,
ఆట వెలది,,,,తేటగీతి,,,,సీసం వంటి పద్యాలు,,,ఈ ఉపజాతుల విభాగం లోనికి వచ్చును .,,వీటికి ప్రాస నియమములు లేవు కాని ( ప్రాస నియమం లేకున్నను ఇష్టమైనచో ప్రాసయతి వేయ వచ్చును)

ఇలా వృత్తాలని .,,జాతులని,,,ఉపజాతులని ఏర్పడిన పద్యాలు అసంఖ్యకాలు,,కోట్ల సంఖ్యలో ఉన్న ఈ పద్యాలు మనం ఉదహరించ లేము కావున మనకు తెలిసిన కొన్ని పద్య లక్షణాలను గురించి రేపటినుండి తెలుసు కుందాము,,,,,

1--ఉత్పలమాలావృత్తము---లక్షణములు

1--గణాలు,,, భ---ర----న---భ--భ---ర---వ (లగం)
UII -UIU- III- UII -UII -UIU- IU
2--యతి 10వ అక్షరం

3--ప్రాస నియమం కలదు

4--అక్షర నియతి.,,20 అక్షరాలు(3×6+2=20)

ఉదాహరణ ...,,

శ్రీ షిరిడీ నివాసమయి, చేతము పూర్ణ దయార్ద్ర వంతమై
వేషము సాదురూపమయి, విహ్వాల భక్తజనాళి రక్ష పై
యీషణ లేని యోగివయి, యీజగమంతయు ముక్తిదామమ
న్భాషణ మందఁజేసితివి భాగ్య విధాత! సమర్ధ సద్గురూ!

మొదటి పాదం వివరణ

భ ర న భ భ ర వ
UII UIU I I I U I I U I I U I U IU
శ్రీ షిరి డీనివా సమయి చేతము పూర్ణద యార్ద్రవం తమై

1--భ-ర-న-భ-భ-ర-వ అనే గణాలు వాడబడినవి,

2--"ష".అనే అక్షరము పాదపాదాన రెండవ అక్షరమై ప్రాసాక్షరముగా వాడబడినది,

3-- "శ్రీ" అనే మొదటి అక్షరానికి "చే" అనే మిత్రాక్షరము 10 వ అక్షరం యతిస్థానములో వాడ బడినది ,

4-- పాదమునందు మొత్తము 20 అక్షరాలు వ్రాయబడి అక్షర నియతి పాటించ బడినది ,

కావున ఇది ఉత్పలమాలావృత్త పద్యపాదమైనది మిగిలిన మూడు పాదములు మీరు సాధన చేయగలరు,

2--చంపక మాలావృత్తము-----లక్షణాలు

1)గణాలు,, న / జ / భ /జ / జ / జ / ర
III/IUI /UII/IUI /IUI/ IUI/ UIU
2),యతి---11వ అక్షరము

3).అక్షర నియమము.. 21.అక్షరములు పాద పాదమున ఉండవలెను..(3×7=21)

4...ప్రాస నీయమము కలదు..

ఉదాహరణము:-

త్రిభువన వంద్య గోపయువతీజన సంచిత భాగధేయ రుక్
ప్రభవ సముత్కరోజ్వల శిరస్స్థిత రత్న మరీచి మంజరీ
విభవ సముజ్వలత్పదరవింద ముకుంద యనంగ నొప్పు నా
జభములు జా జరేఫములు జంపకమాల కగున్ దిశాయతిన్

మొదటి పాదం వివరణ

న జ భ జ జ జ ర
I I I / I U I / U I I / I U I / I U I / I U I / UIU
త్రిభువ/నవంద్య/గోపయు/వతీజ/నసంచి/తభాగ/ దేవరుక్

1--పై పాదమునందు న జ భ జ జ జ ర,,,

అనేగణములు వాడబడినవి

2--"భ"---అనే అక్షరము ప్రాసాక్షరముగా వాడ బడినది

3--"త్రి "అనే మొదటి అక్షరమునకు" తీ " అనే అక్షరము యతి గా యతి స్థానమైన 11వ అక్షరముగా వాడ బడినది.

4--పాదము నందు మొత్తము 21 అక్షరములు వాడబడినవి

కావున ఇది చంపక మాలావృత్త పద్యపాదము,,,

మిగిలిన మూడు పాదములు మీరు గుర్తించి సాధన చేయ గలరు.,,.,

పైన చెప్పిన ఉత్పలమాల,,,,చంపకమాల,,ఈ రెండు వృత్తములకు సంబంధించిన ఒక చమాత్కారమైన విషయం చూద్దాము,

ఉత్పలమాల పద్యాన్ని చంపక మాల గాను, చంపకమాల పద్యాన్ని ఉత్పలమాల గాను మార్చవచ్చు ఎలా అంటే ఉత్పలమాల ఎల్లవేళలా "భ" గణము తోనే ప్రారంభించ బడుతుంది అంటే ప్రతి పాదము మొదటి అక్షరం "గురువు" తో ప్రారంభం చెయ్యాలి ఈ గురువును రెండు లఘువులుగా మార్చి వ్రాయగలిగితే పాదము పూర్తిగా గణవిభజన మారి చంపక మాల పద్యపాదము అవుతుంది,(20 అక్షరాలు 21 అవుతాయి,,10 స్థానంలోని యతి మైత్రి అక్షరం 11 వ స్థానమునకు మారి సరిపోతుఃది కేవలమూ మొదటి గురువును రెండు లఘువులుగా మార్చ గలిగిన చాలు. క్రింద గమనించండి.,

భ ర న భ భ ర వ(లగ)

UII UIU I I I U I I U I I U I U IU

శ్రీ షిరి/ డీనివా/ సమయి/ చేతము /పూర్ణద/ యార్ద్రవం/తమై

(18+2**మొత్తము 20 అక్షరాలు)

(ఇది ఉత్పలమాల పద్యపాదము)

,శ్రీ కి బదులుగా వికృతి పదమైన"సిరి"వ్రాద్దాము.,,,,

న జ భ జ జ జ ర

I I I / IUI /U I I / I U I / I U I / I U I / UIU

సిరిషి/ రిడీని /వాసమ/ యిచేత /ముపూర్ణ/ దయార్ద్ర / వంతమై

(ఒక గురువు స్థానములో రెండు లఘువులు వ్రాసినందున న జ భ జ జ జ ర, అనేగణాలు వచ్చి,11 వ అక్షరము యతి మైత్రి చెల్లి 21 అక్షరముల అక్షర నియతి పాటించ బడి,ఇది చంపకమాల పద్యపాదము అయినది)

అలాగే చంపకమాల ఉత్పలమాలగా ఎలామారుతుందో చూద్దాం ,

న జ భ జ జ జ ర

I I I / I U I / U I I / I U I & I U I / IUI / UIU

త్రిభువ/నవంద్య/గోపయు/వతీజ/నసంచి/తభాగ/దేయరుక్

భ ర న భ భ ర వ

U I I / U I U / I I I / U I I / U I I /U I U / IU

త్రీవన / వంద్యగో/ పయువ/ తీజన /సంచిత/ భాగదే /యరుక్

,("త్రిభు" అనే రెండు లఘువుల స్థానములో "త్రీ " అనే గురువు వచ్చుట వలన,,,భ ర న భ భ ర వ .,,అనే గణాలు వచ్చి 10 వ

అక్షరం యతి స్థానములో యతిమైత్రి చెల్లి,,,20 అక్షరముల అక్షర నియతి సరిపోవటము వలన ఉత్పలమాల అని ఛంధశ్శాస్త్రం చెబుతోంది,,,,,,

ఈ విధముగా కవులు చంపకమాలను ఉత్పలమాలగాను,,,ఉత్పలమాలను.చంపకమాలగాను మార్చి వ్రాసి రాజుల మన్ననలను పొందే వారట

చాలా అద్భుతంగాను చమత్కార యుతము గాను
నున్నది కదా మీరు కూడా సాదన చేయండి,,,,

మత్తేభ విక్రీడితము..,,,

1.గణాలు,.....

స భ ర న మ య వ (లగ)
IIU UII UIU I I I UUU IUU IU

2.యతి,,,,14వ అక్షరం

3.ప్రాస నీయమము కలదు.

4.అక్షర నియతి,,,20........

ఉదాహరణకు ...,,

భవరోగ ప్రవినాశనౌషధ కలా ప్రావీణ్య గణ్యుండు శై
లవిభేధి ప్రముఖాఖిలామర దరోల్లాసుండు గోవిందుఁ డం
చు వివేకుల్స భరంబులు న్నమయవస్తోమంబు గూడన్ సమా
రవిధిం జెప్పుడు రాత్రయోదశ యతిన్మత్తేభ విక్రీడితన్

స భ ర న మ య వ
I I U UII UIU I I I UUU I U U IU
భవరో-గప్రవి-నాశనౌ-షదక-లాప్రావీ-ణ్యగణ్యుం-డుశై

1.. పై పాదమునందు,,,స భ ర న మ య వ (లగం) అనే గణాలు వాడ బడినవి,

2--మొదటి అక్షరమైన "భ" కు 14 వ అక్షరమైన "ప్రా " కు యతి చెల్లినది.,

3--వ అనే అక్షరం ప్రాసాక్షరముగా వాడబడినది,,

4. 20.అక్షరములచే వ్రాయ బడినది.,,,,,,,కనుక

ఇది మత్తేభ విక్రీడిత పద్యపాదమైనది,,,,

మిగిలినవి మూడు పాదములు మీరు సాదన చేసి చూసుకోగలరు ,

శార్ధూల విక్రీడితము,,,,,,,,,

1--గణాలు,,

మ స జ స త త గ

UUU IIU IUI IIU UUI UUI U....

2--యతి 13 వ అక్షరం యతిస్థానము

3--ప్రాస నియమము కలదు

4--అక్షర నియతి,,,,19 అక్షరములు,,,,ఈ నియమములను అనుసరించి వ్రాయునది,,,"శార్ధూల విక్రీడితము",,,,.

..ఉదాహరణకు.,,

పాలోనీరొ; సుఖంబొ? కష్టమొ? యికన్పాపంబొ? పుణ్యంబొ? తా

పాలో? శాపములో? వరాలొ? వెతలో, పాపిష్టి కర్మంబులో?

కాలుండర్మిలి పాశముల్విడుచునో కానొప్పు నెవ్వేనియు

న్నేలా? భాధలునాకు, నీదుకరుణల్నిండార సాయీశ్వరా

మ స జ స త త గ

UUU I I U IUI IIU UUI UUI U

పాలోనీ-రొసుఖం-బొకష్ట-మొయిక-న్పావంబొ-పుణ్యంబొ- తా

1--మ స జ స త త గ అనే గణాలు వాడబడినాయి.

2-ల అనే అక్షరం ప్రాసగా వాడబడినది

3-"పా" అనే మొదటి అక్షరానికి 13 వ అక్షరమైనపా కు యతి చెల్లింది


4-19 అక్షరాలతో వ్రాయబడి అక్షర నియతి పాటించ బడినది,,,

కావున ఇది శార్ధూల విక్రీడిత పద్య పాదమైనది,,,

మిగిలిన మూడు పాదములు మీరు సాదన చేయ గలరు,,,





## చిలకమర్తి వారి ఛలోక్తి



అడిదము సూరకవి ఒకనాడు తాటి ఆకుల మీద వ్రాయబడిన మహాభారతమును చేతబట్టుకుని నడచి పోవుచుండగా, ఒక వెలమదొర చూచి - అయ్యా! "ఈ వేళ వర్జ్యము ఎప్పుడు అని అడిగెను. నేను కవిత్వము చెప్పుదును కాని పంచాంగము చెప్పను. అందుచేత నాకు తెలియదు" అని సూరకవి ప్రత్యుత్తరమిచ్చెను. "అంత పెద్ద పుస్తకము చదువుకున్న వాడవు. నీకు పంచాంగము చెప్పుట తెలియదా?" అని ఆ వెలమదొర కవిని పరిహసించి తన దారిని పోయెను. మరునాడు ఆ వెలమదొర చేత పెద్ద కత్తి పట్టుకుని పోవుచుండగా సూరకవి వానిని సమీపించి "అయ్యా! నాకు క్షురకర్మ చేయగలవా?" అని అడిగెను. వెలమదొర ఆ మాటలు విని ఆశ్చర్యపడి కోపంతో ..... " నేను మంగలి ననుకొంటివా? "యని పలికెవు. సూరకవి ఆ మాటలు విని "కత్తి ఇంత పొడవుగా ఉన్నది. క్షురకర్మ చేయుటకే పనికిరాని దీని ప్రయోజనమేమని" పరిహసించి పోయెను.

❖❖❖❖❖




❖❖❖❖❖

# సంగీత నాదామృతం

శ్రీమతి పద్మ మల్లెల, సిడ్నీ, ఆస్ట్రేలియా



"ఓంకారంచ పరబ్రహ్మ యావదోంకార సంభవః

అ కారోకార మా కార ఏతే సంగీత సంభవాః"

అనగా ఓంకారం పరబ్రహ్మ స్వరూపం దీనినుండే ప్రపంచ ముద్భవించింది. దీనిలోని అ కార ఉకార మ కారముల నుండి సంగీతముద్భవించిందని అర్థం. దీనిలో తిరిగి

" అకారో విష్ణు రూపంచ ఉకారో బ్రహ్మ రూపకం

మకారో భర్గ రూపంచ సర్వమోంకార రూపకం"

అనగా అకారం విష్ణు స్వరూపం, ఉకారం బ్రహ్మ రూపం మరియు మకారం శివ స్వరూపం కనుక ఈ మూడు శబ్దములనుండి జనించిన సంగీతం త్రిమూర్తుల స్వరూపంగా శాస్త్రాలు ఉటంకించాయి.

ఇంకా సంగీతమనే శబ్దం యొక్క వేరే అర్థాలు పరిశీలిస్తే గీతం అంటే పాట మరియు 'సమ్యగ్గీత మితి సంగీతం' అంటే భరతుని నాట్య శాస్త్రంలో ఇచ్చిన అర్థం ప్రకారం నృత్య, గీత మరియు వాద్యాల చేరిక సంగీతంగా చెప్పబడింది. ఇంకా సమ్యగ్గీతమంటే రాగ, స్వర తాళాల సమ్మేళనం సంగీతం. ఇక ఈ మూడు నాదం లేకుండా ఉండలేవు కనుక సంగీతమంటే సునాదము కనుక కర్ణాటక సంగీత మనే పదానికి శాస్త్రీయ మైన అర్థం చెవికి ఇంపైన నాదం అంటే sound.

కనుక ఇటువంటి నాదానికి ఆధారమయిన లక్షణాన్ని పరిశీలిస్తే, దాని పుట్టుక ఈక్రింది విధంగా చెప్పబడింది.

" ఆత్మా వివక్ష మాణోయం మనఃప్రేరయతే మనః

నాభిస్త వహ్ని మాహంతి సప్రేరయతి మారుతం

బ్రహ్మగ్రంధి స్థితో నాదః క్రమాదూర్ధ్వ పథేచరన్

నాభి హృత్కంఠ మూర్ధాన్యే ష్వావిర్భవతి సధ్వనిః"

అనగా మనలోఉండే ఆత్మ (soul) మనస్సుని ప్రేరేపిస్తుంది. ఆ మనస్సు నాభి యందున్న అగ్నిని కొట్టగా అది హృదయంలోని వాయువును ప్రేరేపించి రెండూ కలిసి సంగీతం రూపంలో బయటికి వస్తుంది. ఇది మనకి త్యాగరాజ స్వామి వారు రచించిన "శోభిల్లు సప్తస్వర" అనే కీర్తన లోని అనుపల్లవి లో ' నాభీ హృత్కంఠ రసన నాసాదుల యందు" శోభిల్లు సప్తస్వర అనే వాక్యాలలో ప్రస్ఫుటమవుతుంది. అలాగే ఈ నాదం మన శరీరంలో ఎక్కడ నుంచి ఉద్భవిస్తే సునాదం, సంగీతనాదం అనిపించుకుంటుందో కూడా మన పెద్దలు విశదీకరించారు. ఇది శరీరంలోని నాభి యందు సూక్ష్మముగానూ, హృదయమందు శక్తిని కూర్చుకుని కంఠమునందు పూర్ణముగా ఉండి ముక్కు నుండి కొంచము శక్తిని కలుపుకొని రసనము అనగా నాలుక ద్వారా మాట లేక పాటరూపంలో ఉద్భవిస్తుంది. ఇదే పైన ఉదహరించిన త్యాగరాజ కీర్తనలో కూడా చెప్పబడింది. ఇటువంటి చక్కని పుట్టుక కలిగిన నాదం యొక్క ఉపయోగాలు అనేకం.

ఈనాటి సాంకేతిక ప్రపంచంలో sound waves ని అనేకరకాలుగా మానవ మనుగడకి ఉపయోగ కరం గా శాస్త్రజ్ఞులు వాడటం మనం చూస్తున్నాము. అటువంటి ఉపయోగాలు కర్ణాటక సంగీతమనే సునాదం వల్ల అనేకం ఉన్నాయి. అది ఎలాగంటే ఇందాక పైన చెప్పబడిన మనిషి లోని ప్రాణ, వాయు సంయోగం శరీరంలో బహుళంగా ఉపయోగ పడే sonic waves generate చేసి మన ఆయురారోగ్యాలు అభివృద్ధి చేస్తాయి. ఉదాహరణకి, ఈ సునాదం మానవుని శరీరంలో రక్త ప్రసారాన్ని సరళీకృతం చేసి రక్త పోటువంటి రుగ్మతలనుంచి కొంతవరకూ కాపాడతాయి. నాడీమండలాన్ని అనగా మన nervous system మీద కూడా దీని ప్రభావం అమిత మయినది. అల్జైమర్స్ లాంటి రుగ్మతలకి చక్కని మందు మన సంగీతం. ఇక పిల్లలలో చూస్తే ఈ విద్య వల్ల వారిలోని జ్ఞాపక శక్తిని, ధారణ శక్తిని ఇనుమడింప జేయటానికి చాలా చక్కని సాధనం.

ఇక ఈ ధ్వని తరంగాలు మనస్సు మీద ప్రభావం చూపి మానసిక సంచలనాలను, భావోద్వేగాలనూ నియంత్రించి మనుష్యుల లోని హింసా ప్రవృత్తిని కూడా నియంత్రిస్తాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

అయితే కర్ణాటక సంగీతమే తెలుసుకోవాలా అనే సందేహం మనకి కలగవచ్చు. భౌతిక శాస్త్రపరంగా చూస్తే మానవ కర్ణేంద్రియం భరించగల శబ్ద తరంగాల పరిధి 20 hetz నుండి 20kilohertz మాత్రమే. అది కర్ణాటక సంగీతంలో స్థిరీకరింప బడిన 22శృతులకూ సరిగ్గా సరిపడుతుంది. ఈ 22శృతులే సప్త స్వరాలుగా వాటి స్వరస్థానాలుగా రూపొందించ బడ్డాయి.

ఇంతే కాకుండా పిల్లలకు ఈ సంగీతంవల్ల సమకాలీన విద్యాభ్యాసానికి అవసరమయిన logical reasoning ఇనుమడించటానికి సహాయపడుతుంది. ఎలాగంటే ఇందులో ఉన్నస్వరస్థానాల మధ్య ఉన్నఅతి సూక్ష్మమైనదూరంనించి అతి దీర్ఘమైన దూరంవరకు చక్కగా స్థిరీకరింప బడ్డాయి. కనుక అవి అర్థం చేసుకొనే శక్తి కలిగితే ఎటువంటి సూక్ష్మ విషయమైనా సులభంగా అవగాహనకు వచ్చే శక్తి కలుగుతుందనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

కనుక ఇటువంటి ఉపయోగాలున్న సంగీత నాదామృతం అందరూ ఉపయోగంచుకో కలిగితే మానవ మనుగడ

సులభతరమవుతుంది.

ఆధునిక కాలంలోని యాంత్రిక జీవన విధానంలోని ఒడిదుడుకులను తట్టుకొని నిలబడగలిగే శక్తిని ఇవ్వగలిగిన దివ్యౌషధం గా భాసిల్లుతుంది.

❖❖❖❖❖








❖❖❖❖❖




❖❖❖❖❖

# జీవితమే సఫలం

విజయ గొల్లపూడి- సిడ్నీ, ఆస్ట్రేలియా

'జాగృతి' వారపత్రిక నిర్వహించిన 'శ్రీ వాకాటి పాండురంగారావు' స్మారక కథల పోటీలో 1000 రూపాయలు ప్రోత్సాహక బహుమతి పొందిన కథ 'జీవితమే సఫలం'

*********************************************************************************************
సౌమ్యకి మనసంతా ఆందోళనగా ఉంది. కంటిమీద కునుకు రావటం లేదు. భవిష్యత్తు గురించి కించిత్ ఆందోళనగా ఉంది. "రేపు తర్వాత నా ప్రణాళిక ఏమిటి? నేను ఏం చెయ్యాలి? సమయాన్ని ఎలా వెళ్ళబుచ్చాలి? ఉద్యోగం లేకుండా ఒక్క క్షణమైనా ఊహించుకోగలనా?"

తను ఇప్పుడు ఏలుతున్న తన సామ్రాజ్యం - ఒక సంస్థకి హెడ్ గా ఉంటూ, పని ప్రారంభించగానే చుట్టూ ఉండే తన కొలీగ్స్, మీటింగులు, ఏ సమస్య ఎదురైనా చిటికెలో పరిష్కరించగలిగే సామర్థ్యం ఇవన్నీ సౌమ్యని ఎదురు లేని మనిషిగా నిలబెట్టాయి. ప్రతి రోజు స్టాఫ్ అందరినుంచి అందుకునే గ్రీటింగ్స్, పొగడ్తలు, ప్రశంసలు ఇవేమి రేపటి తర్వాత ఇక ఉండవు. ఇంతవరకూ తనకంటూ ఏర్పరుచుకున్న ఆ గూడు తనని ఒంటరిదాన్ని చేసి వెళ్ళిపోయే సమయం ఆసన్నమైంది, తప్పదు అని హెచ్చరించింది. "వర్క్ ఈజ్ వర్షిప్" ఈ సూత్రాన్ని ఆచరణలో పెట్టడం కోసం మంగళసూత్రానికి కూడా దూరమైపోయింది సౌమ్య. ఆఫీసు లో కూడా ఆమెను అందరూ 'ఒంటరి' అని ఏనాడు వేలెత్తి చూపలేదు. " ఓ యూ ఆర్ వెరీ లక్కీ! యూ ఆర్ ఎ ఫ్రీ బర్డ్! "అని అంటూ ఉంటే "అవును, నిజమే సుమా!" అనుకుని మురిసిపోయేది. అవును సమాజం లో పొగడ్తలకు అంత బలముంది. అవి మనిషిలో ఉత్సాహాన్ని నింపేసి, ఒక్కోసారి నిజాన్ని కూడా కప్పేస్తాయి. ఇన్నాళ్ళు తను ఉద్యోగం ద్వారా వచ్చే రాయలిటీస్, పెర్క్స్ అందుకుంటూ ఇదే జీవితం, ఇదే శాశ్వతం అని భావించింది.

ఎంత వద్దనుకున్నా సౌమ్య మనస్సు వినకుండా గతంలోకి జారుకుంది.

*****************************************************

రామనాథం, జానకమ్మ గార్లకు లేక లేక కలిగిన సంతానం సౌమ్య. మా ఇంటి మహాలక్ష్మి, మా గారాలపట్టీ అని ఎంతో అపురూపంగా చూసుకునేవారు ఆమెను. అలా పెరిగిన సౌమ్యకు ఏది కావాలంటే అది క్షణాల్లో అమర్చేవారు రామనాథంగారు. జీవితంలో సవాళ్ళను ఎదుర్కో వటానికి కావలసిన మెళకువలను ఆమెకు దగ్గరుండి బోధించేవారు. "నువ్వు ఏ పని చేస్తున్నా, సమయపాలన పాటించు. నేను నీకొక 'అరగంట పని నియమం' చెపుతాను. దానిని ఆచరణలో పెట్టావంటే నువ్వు సమయాన్ని నీ అదుపులో ఉంచుకున్నట్లే. ప్రతి అరగంటకు నువ్వు చేసే పని ఆపి, ఐదు నిమిషాలు కాస్త రిలాక్స్ అవుతూ, నువ్వు చేసే పని నీ లక్ష్యసాధనకు ఎలా ఉపయోగకరమో ఆలోచించుకో. నువ్వు చేసే పని పూర్తి కాగానే నీకు రివార్డ్ ఇచ్చుకుంటూ ఇష్టమైన పాట విను." ఇలా ఆ తండ్రి తనయకు ఎన్నో మంచి విషయాలు ప్రతిరోజు చెప్పేవారు. తల్లిదండ్రుల ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా స్కూల్ లో ప్రతి ఏడాది సౌమ్య అన్ని సబ్జెక్టులలో అత్యధిక మార్కులు తెచ్చుకునేది. సౌమ్యతో పాటు తరగతిలో తనప్రక్కనే కూర్చునే రమ్య సౌమ్యకి మంచి పోటీ ఇచ్చేది. పదవతరగతి వరకు సౌమ్య టాపర్ గా

తన స్థానాన్ని నిలుపుకుంటూ వచ్చింది. స్కూల్ లో ఎన్నో ప్రత్యేక బహుమతులు, స్కాలర్ షిప్స్, సర్టిఫికెట్స్ అందుకునేది. టీచర్స్, ప్రిన్సిపాల్ ఆమెను అభినందించేవారు. తండ్రి ప్రోగ్రెస్ రిపోర్టు పై సంతకం చేసి, ఆనందం పట్టలేక సౌమ్యకు విలువైన పుస్తకాలు కానుకగా కొని తెచ్చేవాడు. ప్రతిరోజు స్కూల్ కి వెళ్ళడమంటే చెప్పలేని సంతోషంగా ఉండేది సౌమ్యకు. ఆమెకు హైస్కూల్ పూర్తయ్యేసరికి తనమీద తనకు ఒక గట్టి నమ్మకం, ఆత్మవిశ్వాసం ఏర్పడ్డాయి. అప్పుడే సౌమ్య తన మనస్సులో దృఢంగా అనుకుంది, తను కాలేజ్ లో కూడా తన స్థానం ఎప్పుడూ నంబర్ వన్ గానే ఉండి తీరాలి. తనను ఎవరూ బీట్ చేయకూడదు, చేయలేరు" అని. దానికి తగ్గట్టుగా సౌమ్య తనకి చదువు విషయంలో నూరు శాతం మార్కులు రావడానికి ఏమి చేయాలో ప్రణాళికాబద్ధంగా సబ్జక్టులు క్షుణ్ణంగా అధ్యయనం చేసేది. ఈ నేపథ్యంలో తండ్రి కూడా సౌమ్యకి ఎంతో ప్రోత్సాహాన్నిచ్చాడు.

అలా మొదలైన జీవనప్రయాణంలో ఇంట తనకి తోబుట్టువులు ఎవరూ లేకపోయినా, బయట

తనకంటూ ప్రాణమిత్రులను ఏర్పరుచుకోకపోయినా కూడా తను ఒంటరిని అని ఎప్పుడూ భావించలేదు. ఎవరితోను ఎక్కువగా మాట్లాడేది కాదు. తన ఆలోచనలను కార్యరూపంలో పెట్టడమే విధిగా అలవరచుకుంది. దానికి ప్రతిఫలంగా అందరూ తనపై కురిపించే ప్రశంసల వర్షం, పొందే స్కాలర్ షిప్పులు ఇవన్నీ మరేధ్యాసా లేకుండా చేసాయి. ఆఖరికి ఎవరైనా అబ్బాయిలు కాలేజీలో మాట్లాడి, దగ్గరవుదామని చూసినా ముక్తసరిగా, ముక్కుసూటిగా సమాధానాలిచ్చేది. భవిష్యత్తులో ఆమె ఇదే బాటలోనే పయనిస్తూ పెళ్ళిపైకి ఆలోచనలు మళ్ళకుండా చేసాయి. ఒకానొక సందర్భంలో తల్లి జానకి పెళ్ళి ప్రస్తావన తీసుకువచ్చినా సౌమ్య "ససేమిరా ఇప్పుడు కాదు నేను పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి తీరుతాను" అనటంతో తండ్రి కూడా ఆమె నిర్ణయానికి ఎదురుచెప్పలేదు.

ప్రశంసలు, పొగడ్తలు మనిషిని ఒక దశలో సరైన నిర్ణయాలు తీసుకోనీయకుండా చేస్తాయా? ఎవరిమాట వినని మనిషికి ఏమిటి పరిష్కారం? ఏమో అది కాలమే నిర్ణయించాలి.

కాలగమనంలో ఎదురయ్యే అనుభవాలే ప్రతిఒక్కరికీ పాఠాలు నేర్పుతాయేమో!

ఒకదశలో వృత్తిలో పైకెదిగాక ఆయారంగాలలో ఉన్న వారికి ఏర్పడే అభిమానులు, అభిమాన సంఘాలవల్ల సదరు ఆవ్యక్తికి తనమీద తనకే అంచనాలు భారీ స్థాయిలో ఏర్పరుచుకునేలా చేయవచ్చు. ఒక్కోసారి అనుకోకుండా ఏర్పడే అభిమానులు, ఫ్యాన్ అసోసియేషన్స్ వారివల్ల కలిగే అలజడితో అంచనాలను చేరుకోలేకపోతే జీవితంలో బోర్లాపడే ప్రమాదం కూడా లేకపోలేదు. చుట్టూ అలాంటి వ్యక్తులను కూడా గమనించవచ్చు.

సౌమ్య తీసుకున్న ఈ నిర్ణయం ఎటువంటి మలుపులు తిప్పిందో చూడాలి....

***************************************************

సౌమ్యతో కాస్తో కూస్తో కొద్దిపాటి స్నేహం కలిగిఉన్న రమ్య జీవితంలోకి తొంగి చూస్తే........

రమ్య రఘురామయ్య గారి పెద్ద కుమార్తె. ఉమ్మడి కుటుంబ వాతావరణంలో పెరిగిన అమ్మాయి. చుట్టూ ఉన్న కుటుంబంలోని

పరిస్థితులను అర్థం చేసుకుంటూ, ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా పొదుపుగాజీవితాన్ని ఎలా గడపాలో తల్లిదండ్రుల ద్వారా నేర్చుకుంది. ఒకప్రక్క తను చదువుకుంటూ, తమ్ముళ్ళకు కూడా చదువు చెప్పేది. మరోప్రక్క ఇంటి పనులు కూడా చేసేది. క్షణంపాటు తీరికగా ఉండేది కాదు. తండ్రి వయస్సు పైబడుతూ వచ్చే అనారోగ్యం కారణంగా రమ్యకి డిగ్రీ పూర్తి కాగానే త్వరగా పెళ్ళి ప్రయత్నం మొదలు పెట్టాడు. రమ్య వేరే మాట మాట్లాడకుండా తండ్రి తెచ్చిన సంబంధాన్ని చేసేసుకుంది.

మానవునిగా భూమి మీద జన్మించడమనేది ఒకే ఒక్కసారి లభించే అద్భుతమైన వరం. ఆ జీవితానికి సార్థకత చేకూర్చుకుంటూ, తనకు గుర్తింపు తెచ్చుకుంటూ, సమాజంలో తన ఉనికిని చాటుకుంటూ తనని తాను నిరూపించుకుంటూ ప్రతి క్షణం జీవితపు మధురానుభూతులను ఆస్వాదించడమనేది ఏ కొద్దిమందికి మాత్రమే తెలుసు. అది కూడా ఒక కళే. ఒక క్షణం, క్షణాలు గంటలుగా, గంటలు రోజులుగా, రోజులు నెలలుగా, నెలలు ఏడాదిగా కాలం గిర్రున తిరిగిపోతుంది. వెనుతిరిగి చూస్తే గడచిపోయిన కాలం మళ్ళీ తిరిగిరానిది. ఒక క్షణంలో జీవితంలో ఎవరు తీసుకున్న నిర్ణయానికి వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. మరి వేరెవరో కాదు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుని జీవితంలో ఎంతమంది సఫలమవుతున్నారు? **జీవితం సఫలం అవ్వడమంటే ఏమిటి? సంతృప్తి తో జీవించడమా? లేదంటే లోకం చూసే తీరునుబట్టీ ఉద్యోగం, డబ్బు, సొంత ఇల్లు, పెళ్ళి, పిల్లలు, తరగనంత ఆస్తిని సంపాదించటం, ఇంకా మరెన్నో ……. కలగలిపి దాన్ని సక్సెస్ అంటారా?**

*****************************************************

సౌమ్య తను అనుకున్నవిధంగా యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. క్యాంపస్ ఇంటర్వ్యూ ద్వారా పేరున్న ఐటి సంస్థలో ఉద్యోగం వచ్చింది. జీవితంలో ప్రతి మనిషికి అనుకున్న విధంగా ప్రతి విషయంలోను జరుగుతుందా? కొన్ని విషయాలు తనకు సంబంధించినంతవరకు తన ఆధీనంలో ఉంటాయి. కొన్ని వేరే వ్యక్తి జీవితంతో ముడిపడి ఉంటాయి. మరికొన్ని ప్రకృతి నియంత్రిస్తుంది. సౌమ్యకి తనకంటూ వ్యక్తిత్వం వచ్చింది, ఆర్థికస్వాతంత్యం వచ్చింది అన్న ఆనందం క్షణకాలంలో కరిగినట్టనిపించింది. అది తను ఎంతగానో అభిమానించి, తనను ఈ స్థాయికి ఎదగనిచ్చిన తండ్రి హఠాత్ మరణం. దానికి తోడు తనకు ఆసరాగా ఉంటుంది అనుకున్న తల్లి కూడా ఆరునెలల్లోనే తనను పూర్తిగా ఒంటరిదాన్ని చేసి స్వర్గస్థురాలైంది. తన జీవితంలో ఏర్పడిన ఈ వెలితి వల్ల సౌమ్య మానసికస్థితి లో పెద్దగా మార్పు ఏమి రాలేదు. కేవలం వారు లేరన్న దిగులు తప్ప. ఎందుకంటే సౌమ్య చిన్నతనం నుంచి తన లక్ష్యం అంతా చదువు తర్వాత ఉద్యోగం ఇదే జీవితం అనుకుంది. తండ్రిద్వారా అలవరచుకున్న క్రమశిక్షణ, మానసికవికాసానికి తను అవలంబించే మెడిటేషన్ ఇవన్నీ ఆమెకు ఎంతగానో తోడ్పడ్డాయి. నిరాశా, నిస్పృహ అంటే ఏమిటో తెలియకుండా చేసాయి.
తన దృష్టి అంతా పూర్తిగా ఉద్యోగం పైనే పెట్టి ఆరునెలల్లోనే మేనేజర్ గా ప్రోమోషన్ పొందింది. తనకంటూ సరైన సమయంలో ఇంటిని సొంతం చేసుకుంది. కానీ తనకోసం ఒక తోడు, నీడా ఉండాలని కోరుకోలేదు. మరే ఇతర బంధాలు ఎవరితో పెట్టుకోలేదు.
ఒకరకంగా వర్క్ హోలిక్ గా మారిపోయిందామె. ఉద్యోగంలో మధ్యమధ్యలో తన సామర్థ్యాన్ని సవాలు చేస్తూ సౌమ్యకు ఎవరైనా

అడ్డు తగిలినా, రాజకీయాలతో సౌమ్యను ఇబ్బంది పెట్టాలని చూసే బాస్, కొలీగ్స్ లను ధైర్యంగా ఎదుర్కొనేది. వాళ్ల ఎత్తులను ముందే పసిగట్టి తన ఆలోచనలను, ప్రయత్నాలను తను చేసే జాబ్ మీదే పెట్టి తన లక్ష్యాలను సాధించసాగింది.

ఈ ఉద్యోగపర్వంలోనే సౌమ్య జీవితంలో ఎన్నో ఏళ్ళు దొర్లిపోయాయి. కాన్ఫరెన్సెస్, మీటింగ్ లు, సెమినార్స్ హాజరవటంకోసం దేశ, విదేశాలు తిరిగింది. అపారమైన జ్ఞానాన్ని, అనుభవాన్ని గడించింది. ఆమె అవార్డ్స్, సర్టిఫికెట్స్ కైవసం చేసుకుంది. తను చేసే ఐటి సంస్థలో క్రొత్త ఒరవడిని సృష్టించింది. ఈ విజయపరంపరలో సౌమ్యకి పెళ్ళి చేసుకోవాలనే ధ్యాస కలగకపోవటం పరిస్థితుల ప్రభావమే అనుకోవచ్చు. ఏరోజుకారోజు మరునాడు వెళ్ళబోయే స్టేక్ హోల్డర్ మీటింగ్, అక్కడ తన ప్రెసెంటేషన్ ఎలా ఇవ్వాలి, నెక్స్ట కోర్స్ ఆఫ్ యాక్షన్ వీటి చుట్టూ తన ఆలోచనలు పరిభ్రమించేవి. ఆఫీస్ కి వెళ్ళిరావటం, తనకి కావలసినట్టుగా కూరగాయలతో సలాడ్స్, ఆరోగ్యకరమైన డైట్ తీసుకునేది.

ఏనాడు ఎవరితోను తనేమిటో, తన మనస్సులో ఎమోషనల్ ఫీలింగ్స్ వ్యక్తపరచలేదు.

సగటు మనిషి తన జీవితంలో సగభాగం ఉద్యోగం, విధి నిర్వహణకోసం కేటాయిస్తూ, వ్యక్తిగతంగా స్వంత జీవితంగురించి ఆలోచించనీయకుండా చేస్తాయేమో. ఐటి రంగంలో మరే ఇతర రంగంలో పని చేసేవారు డెడ్ లైన్లు చేరుకోవటం కోసం పాపం రాత్రింబగళ్ళు కష్టపడతారు. అవును మరి జీవితం, జీతంతోనే ముడిపడి ఉంటుంది. జాబ్ సెక్యూరిటీ జీవితానికే పెద్ద భద్రత. ఉన్న జాబ్ ని నిలబెట్టుకోవడం కోసం వ్యక్తిగత జీవితంలో ఎన్నో కోల్పోతారు. ముఖ్యంగా మహిళలైతే పిల్లలని చైల్డ్ కేర్ లో వదిలేయాల్సి వస్తుంది. వాళ్ళ అల్లరి, చిలిపిచేష్టలు అవి చూస్తూఉండడంలో పొందే ఆనందాన్ని కోల్పోతున్నారు. ప్రొద్దున్న లేచింది మొదలు,రాత్రి నిద్రపోయేవరకు ఉరుకులు, పరుగులు. మాయాలోకంలో పడి తానేమిటి, తనకిష్టమైనది ఏమిటి అనికూడా గుర్తించలేకపోతున్నారు. చిన్న చిన్న సంతోషాలను అనుభవించలేకపోతున్నారు.

ఈ రోజుల్లో ఆడ, మగ అనే బేధం లేకుండా పరిచయమవ్వగానే అడిగే మొదటి ప్రశ్న "ఏం చేస్తారు" అనే. జీవితంలో హోదాని ఇచ్చేది ఒక ఉద్యోగమేనా లేదా వయస్సుని బట్టి మారుతుందా?

**************************************************

రమ్య పెద్దకోడలిగా అత్తారింట్లోకి అడుగుపెట్టింది. అత్తామామలు పెద్దవారు కావటంతో సగం కుటుంబ బాధ్యత అంతా ఆమె నెత్తిన పడింది. మరిది, ఆడపడుచులకు మేథ్స్, సైన్స్ సబ్జెక్ట్స్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలో వివరించేది. ఇంట్లో అందరికీ వంటలు రుచికరంగా వండిపెట్టేది.  భర్త ఉద్యోగంలో క్యాంపులు అంటూ ఊళ్ళు తిరిగేవాడు.

క్షణం తీరిక లేకుండా అన్ని పనులు సమర్ధంగా నిర్వర్తిస్తూ రమ్య అత్తారింట్లో మంచి పేరు తెచ్చుకుంది.ఆమెకు కలిగిన ఇద్దరు సంతానంతో రమ్య మరింత బిజీ అయ్యింది. పిల్లలను బాధ్యతాయుతంగా తీర్చిదిద్దింది. ఆడపడుచు, మరిది, వదిన సాయంతో చదువులో బాగా రాణిస్తూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం పరీక్షలు రాసి విదేశాలకు వెళ్ళిపోయారు. అక్కడే ఎమ్మెస్ పూర్తిచేసి స్థిరపడిపోయారు. లోకల్ గా ఉంటున్న ఇండియన్ ఫ్యామిలీతో వారికి మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. భారతదేశం వచ్చి పెద్దలసమక్షంలో పెళ్ళి చేసుకుని తిరిగి అమెరికా వెళ్ళిపోయారు.

రమ్య అత్తమామలు పెద్దవారు కావటంతో వారిని కనిపెట్టుకుని వారికి వేళకి కావలసిన మందులు దగ్గిర ఉండి ఇచ్చేది. ప్రాణం పోకడ మనిషి ఆధీనంలో లేనిది. ఎవరెన్ని ఆరోగ్య సూత్రాలు పాటించినా, ఏదో ఒక నెపంతో మనిషికి సమయం

ఆసన్నమవగానే తను ఉన్న శరీరాన్ని ఖాళీ చేసి ఆత్మ పరమాత్మలో లీనమవ్వాల్సిందే. ఈ ప్రయాణంలో ఎన్నో మజిలీలు. ఎలాంటి పరిస్థితి ఎదురైనా, ఆ పరిస్థితికి తగ్గట్టుగా స్పందించి ఆ సమయంలో నెగ్గుకొచ్చినవారే విజేతలు.

మావగారు గుండెపోటు అనే నెపంతో మృత్యువు ఒడి లోకి చేరారు. అత్తగారు బాత్రూం లో కాలుజారిపడి మంచాన పడ్డారు. మూడునెలలకే ఆమె మరణించింది. రమ్య కాలగమనంలో వచ్చే ఒత్తిడులను అధిగమిస్తూ పిల్లలను పెంచి పెద్ద చేసింది. కూతురు దీప్తి, కొడుకు అఖిల్ బాబాయిని స్ఫూర్తిగా తీసుకుని ఎప్పుడు రెక్కలు వస్తాయా అని ఎదురు చూస్తూ అమెరికా దేశానికి ఎగిరి వెళ్ళిపోవాలని కలలు కంటున్నారు. ఇదిలా ఉండగా భర్త క్యాంప్ నుంచి తిరిగివస్తూ కారు ప్రమాదంలో చనిపోయాడు అనే వార్త రమ్యను విషాదం లో ముంచి సగం ఒంటరిదాన్ని చేసింది. తనకి కలిగిన బాధను దిగమ్రింగుకుంటూ, పిల్లల భవిష్యత్తుకు ఆటంకం కలగకుండా వారికి ధైర్యాన్ని నూరిపోసింది. మరిది, ఆడపడుచు రెండేళ్ళకోసారి చుట్టపుచూపుగా వచ్చినా హడావిడిగా ఉండి తిరిగివెళ్ళిపోయేవారు. పిల్లలు కాలేజ్ చదువు పూర్తికాగానే వాళ్ళ మనసులో కోరిక బయట పెట్టారు. పై చదువులకోసం, అమెరికా వెడతాం అని పట్టుబట్టారు. ఇంక చేసేదేమి లేక భర్తద్వారా సంక్రమించిన ఇన్సూరెన్స్ డబ్బు కూడగట్టుకుని పిల్లలిద్దరినీ అమెరికా పంపించింది. పిల్లలిద్దరు అక్కడే జాబ్ తెచ్చుకుని ప్రయోజకులయ్యారని తెలిసి సంతోషించింది. మొదట్లో తల్లికి ఫోన్ చేసి విషయాలు తెలిపేవారు. క్రమక్రమంగా రమ్యకి పిల్లలిద్దరినుంచి ఆ ఫోన్లు కూడా రావటం మానేసాయి. అక్కడ వారిద్దరు నచ్చిన భాగస్వామిని ఎంచుకుని రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుని స్థిరపడిపోయారు. ఒకానొక సందర్భంలో ఆ వార్త రమ్య చెవిలో నెమ్మదిగా వేసారు. మేము సెటిల్ అయ్యాక ఇండియా ఒకసారి అందరం వచ్చి వెడతాం అని చెప్పారు. రమ్యకి ఒక్కసారిగా జీవితంలో శూన్యం ఆవహించింది. "ఇన్నాళ్ళు ఎవరికోసం ఇంత కష్టపడ్డాను. నాకుటుంబం, నా వాళ్ళూ అనుకుని రాత్రింబగళ్ళు అలుపెరగకుండా చాకిరీ చేసాను. నాకంటూ ఇప్పుడు ఒక్కళ్ళు లేరా? అందరికీ సేవ చేయటంలోనే తృప్తిని పొందాను. ఇపుడు నాకు చివరికి మిగిలిందేమిటి? నేను ఒంటరిదానినా? నా ఇష్టాలన్నీ వదులుకున్నాను. హాబీలు అన్నిటినీ వదిలిపెట్టేసాను. జీవితంలో పొరపాటు చేసానా?" అని మధనపడింది.

********************************************************

సౌమ్య గతాన్ని ఆలోచిస్తూ తెలీకుండా నిద్రలోకి జారుకుంది. నిద్రలేవగానే కళ్ళముందు అమ్మ మెదిలింది. "నేను తప్పటడుగు వేసానా? ఆ రోజు అమ్మ మాట ఒక్కక్షణం విని పెళ్ళి చేసుకుని ఉండాల్సింది. హాయిగా నాకంటూ ఒక చిన్ని ప్రపంచాన్ని నిర్మించుకోలేకపోయానా? నాజీవితం చేజారిపోయిందా?" అని విరక్తిగా అనుకుంది.

"నా ఉద్యోగపర్వంలో ఇదే ఆఖరిరోజు" అనుకుంటూ వర్క్ లో అడుగుపెట్టింది. స్టాఫ్ అందరూ సాదరంగా ఆహ్వానం పలికారు. హాల్ లో అందరూ సౌమ్య సంస్థ కోసం చేసిన కృషిని కొనియాడారు. అందరి సంతకాలతో ఒక గ్రీటింగ్ కార్డ్, పూలబొకే, గిఫ్ట్ ప్యాకెట్ ఆమె చేతిలో పెట్టా రు. ఘనంగా ఫేర్ వెల్ చెపుతూ సౌమ్యకు అందరూ వీడ్కోలు చెప్పారు.

"గతం గతః. జరిగిందేదో జరిగిపోయింది" అనుకుంటూ సౌమ్య వేరే ఆలోచనకు తావివ్వకుండా మర్నాడు షిర్డీ వెళ్ళడానికి టికెట్ బుక్ చేసుకుంది. రైలు ఎక్కి లగేజ్ సీటు దగ్గర పెట్టుకుని కూర్చుంది. తనకిష్టమైన 'రీడర్స్ డైజెస్ట్' పుస్తకం పేజీలు తిరగేయసాగింది. ఎదురుసీట్లో సాంప్రదాయకంగా తీరైన దుస్తులలో మరొక మహిళ కూర్చుని 'ఋషిపీఠం' పత్రిక చదువుతోంది. అప్రయత్నంగా సౌమ్య చూపులు ఆమె పైకి మళ్ళాయి. చూడగానే ఎవరికైనా మాట్లాడాలి అనిపించే కళకళాలాడే వర్చస్సు ఆమెది. ఆమె రూపురేఖలను అదే పనిగా చూస్తూ "ఈమె ఎవరై ఉంటుంది. ఎక్కడో చూసినట్టుగా ఉంది. కానీ గుర్తు రావటం

లేదు" అనుకుంటూ సౌమ్య ఆమెని ఎగాదిగా చూస్తోంది. ఎదురుగా ఉన్న ఆ వ్యక్తి పలకరింపుగా నవ్వింది. జీవితమజిలీలో మనకి ఎంతోమంది వ్యక్తులు కలుస్తూ ఉంటారు. ఒక్కొక్కరిని చూడగానే ఎదో తెలియని ఆత్మీయ భావనే వారితో మాట్లాడాలి అని సద్భావన కలుగచేస్తుంది. మరొకరిని చూస్తే అసలు పన్నెత్తి పలుకరించాలని కూడా అనిపించదు. అది అందమా, ఆకర్షణ అంటే కానే కాదు. ఆ వ్యక్తిలో ఉట్టిపడే పాజిటివ్ ఎనర్జీ, జీవితంపై వారికున్న దృక్పధం, వారు చేసే సాధన, దైవిక ప్రార్ధనలు వారి ముఖంలో ప్రతిబింబిస్తాయేమో.

"నమస్తే మీరు ఎక్కడివరకు వెడుతున్నారు?" అనుకోకుండా వచ్చిన ఆ పలకరింపుకు నవ్వుతూ సౌమ్య షిర్డీ వెడుతున్నానని సమాధానమిచ్చింది.

"నేను కూడా షిర్డీ వెడుతున్నాను. నా పేరు రమ్య"

"పేరు ఎక్కడో విన్నాను అనుకుంటూ నా పేరు సౌమ్య"

"మీరు ఎక్కడ ఉంటారు?"

ఇలా ఒకళ్ళ వివరాలు ఒకరు తెలుసుకుంటూ ఒక్కసారిగా గట్టిగా కావలించుకుని కన్నీళ్ళు పెట్టుకున్నారు.

చిన్ననాటి బాల్యస్నేహితులు మళ్ళీ నలభై ఏళ్ళ తరువాత కలుసుకున్నారు.

వాళ్ళ జీవితంలో ఎదురైన ఒంటరిభావన వారి కలయిక వల్ల తొలగినట్లనిపించింది. ఎన్నో పాత జ్ఞాపకాలు, ఇద్దరు విడిపోయాక ఎదురైన అనుభవాలు ఒకరితో ఒకరు పంచుకున్నారు.

సౌమ్య అంది, "ఏమిటోనే రమ్యా! జీవితపు చరమాంకంలోకి చేరుకున్నాక ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుని ఇంతవరకు నేనేమి సాధించాను అని ఆలోచించుకుంటే పెద్ద శూన్యం తప్ప ఏమీ కనిపించటం లేదు. నా మనస్సుని భయంకరమైన నైరాశ్యం కమ్మేస్తోంది. అప్పట్లో మా అమ్మ మాట విని పెళ్ళి చేసేసుకుని ఉంటే నాకంటూ భర్త, పిల్లలతో ఒక కుటుంబం ఏర్పడి ఉండేది. అప్పుడు బంధాలు, అనుబంధాలు ఏర్పడి ఉండేవి. నువ్వు హాయిగా పెళ్ళి చేసుకుని సుఖమయమైన సంసార జీవితం గడుపుతున్నావు. ఎంతో సంతోషంగా, ఉత్సాహంగా ఉన్నావు.నేను కోల్పోయిందేమిటో ఇప్పుడు నాకు కొట్టొచ్చినట్టుగా తెలుస్తోంది"

సౌమ్య కళ్ళనుంచి ఆగకుండా కన్నీరు ప్రవహిస్తోంది. ఆమె మాటలు విన్న రమ్య వెక్కి వెక్కి ఏడవసాగింది. సౌమ్య కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అంది. "అయ్యో రమ్యా! నా మనస్సులో గూడు కట్టుకున్న బాధనంతటినీ నీతో వెళ్ళగక్కుకుని అనవసరంగా బాధపెట్టాను. ప్లీజ్ ఏడవకు. నా చిన్ననాటి స్నేహితురాలు, నా ప్రియమైన రమ్య సంతోషంగా ఉంది. అది చాలు నాకు."

రమ్య ఏడుపు ఇంకా ఎక్కువైంది. "అయ్యో సౌమ్యా! నువ్వు చెప్పింది విని నేను బాధ పడటం లేదు. నీ ఉద్యోగం గురించి, నీ హోదా గురించి, నీ విలాసవంతమైన జీవితం గురించి నువ్వు చెపుతూఉంటే నేను పెళ్ళిచేసుకుని ఎంత తప్పు చేశానా అని బాధ కలిగింది. నాకోసమంటూ నేనెప్పుడూ బ్రతకలేదు. ఎంతసేపూ అత్తమామలకీ, మొగుడికీ, మరిదికీ, ఆడబడుచుకి ఊడిగం చేయటంతోనే బ్రతుకంతా గడిచిపోయింది. ఇంక పిల్లలంటావా వాళ్ళని పైకి తీసుకురావాల్సిన బాధ్యత కూడా నామీదే పడింది. చివరికి ఏమైంది? వాళ్ళు కూడా తమ దారి తాము చూసుకున్నారు. ఇవన్నీ తలుచుకుంటుంటే చాలా నిరాశగా ఉంది. నువ్వు బాగున్నావనే నేననుకున్నాను. నేను బాగున్నావని నువు అనుకున్నావు. కాని గమ్మత్తుగా ఇద్దరం కూడా ఈ

వృద్ధాప్యంలో ఏకాకులగానే మిగిలిపోయాము." అని కళ్ళనీరు తుడుచుకుంటూ సౌమ్యకేసి చూసి చిరునవ్వు నవ్వింది. సౌమ్య కూడా రమ్యకేసి చూసి నవ్వింది. వారి నవ్వులు క్రమేపి పెద్దవై ఇద్దరు పగలబడి నవ్వుకున్నారు. రమ్య అంది "ఓ దూరపుకొండా! నువ్వు నున్నగా ఉన్నావనుకున్నాను సుమీ! అంది పక పకా నవ్వుతూ." సౌమ్య రమ్య బుగ్గ మీద చిటిక వేసి "మరేనే దూరపుకొండా! నేను కూడా నువ్వు చాలా నున్నగా ఉన్నావు అనుకున్నాను సుమీ!"అంది. ఇద్దరూ మనసారా హాయిగా నవ్వుకున్నారు. మళ్ళీ వారి ఒంటరి బ్రతుకు వారి జీవితంలో ఏర్పడిన శూన్యం గురించి చర్చించుకున్నారు. అలా చర్చించుకుంటూ, చర్చించుకుంటూ ఇద్దరూ ఒక నిర్ణయానికి వచ్చారు. రమ్య అంది "సౌమ్యా! ఇప్పుడు మనం ఇద్దరం ఒంటరివాళ్ళం కానేకాదు. నాకు నువ్వు,నీకు నేను ఆ భగవంతుడే కలిపాడు"అంది. సౌమ్య సంతోషంగా అంది "అవునే రమ్యా! మన జీవితాలు అయిపోలేదు.ఇప్పుడే మన ఇద్దరికీ మరో క్రొత్త జీవితం మొదలవబోతోంది.

"మనం ఇద్దరం ఒంటరివాళ్ళం కానేకాదు. మనజీవితం అయిపోలేదు. ఇప్పుడే మరో క్రొత్త జీవితం మొదలవబోతోంది. మనం ఇద్దరం మన అనుభవం, చదువు, లైఫ్ స్కిల్స్ వీటిని జోడించి ఒక సంస్థని నెలకొల్పుదాము.

“జీవితంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు, సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం, శక్తి, సామర్థ్యాలు, జీవితంపై ఒక అవగాహన, పట్టు, దశ, దిశ, గమ్యం నిర్దేశించాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకుందాం అనుకోకుండా ముందుగానే నేటి యువతకు డెసిషన్ మేకింగ్ స్కిల్స్ అనేవి తెలియచెపుదాం. అయితే డాక్టర్ లేకపోతే ఇంజనీర్ అనే ఆలోచన నుంచి తల్లిదండ్రులు బయట పడాలి. జీవితంలో ఎన్నో మార్గాలు ఉన్నాయి.

“జీవితం అంటే పూలబాట, ముళ్లబాట కానే కాదు.

అయిష్టంగా ఏ పని చేయద్దు. ఆడుతూ, పాడుతూ వారికి నచ్చినమార్గాన్ని వారే ఎంచుకోవాలి. సమయాన్ని వారి చేతుల్లోకి వారే తీసుకోవాలి. ఉన్న జీవితాన్నిసఫలం చేసుకోవాలి”.

యువతను ఈ ఆశయ సాధనతో ప్రయోజకులుగా తయారుచేద్దాము. తీర్చిదిద్దుదాం. మనం గతంలో ఏ పొరపాట్లు చేసామో అవి వేరొకరి జీవితాలలో పునరావృతం కాకుండా చేద్దాం”.

రైలు ఆగిన స్టేషన్ నుంచి నెమ్మదిగా పట్టాల మీదనించి కదులుతోంది.

రమ్య, సౌమ్య మనసారా నవ్వుకుంటూ ఆనందంగా కాఫీ తాగుతున్నారు.


---

❖❖❖❖❖

www.indausimmigration.com
INDAUS IMMIGRATION
Immigration Professionals....Since 2003

❖❖❖❖❖









❖❖❖❖❖

# వరదా! వరదా!!

-శ్రీ పెయ్యేటి రంగారావు, హైదరాబాద్



భగవంతుడు భక్తసులభుడు. ఆ భక్తుడు సత్త్వగుణ సంపన్నుడా, రజోగుణం కలిగిన వాడా లేక తామస ప్రవృత్తితో రగిలిపోతున్న వాడా అన్నది ఆ పరమేశ్వరునకు అనవసరం. భక్తుడు త్రికరణశుద్ధిగా చేసే పూజలనే ఆయన పరిగణన లోనికి తీసుకుంటాడు. అందువల్లనే, మార్కండేయుడినీ అనుగ్రహించాడు, కన్నప్పనూ అనుగ్రహించాడు, సాలెపురుగుకూ మోక్షమిచ్చాడు. ఇంకా తరచి చూస్తే రావణాసురునకు, భస్మాసురునకు కూడా అడిగిన వరాలన్నీ ప్రేమగా ఇచ్చి పడేసాడు. నరులు, వానరులు తప్ప మరెవరి చేతిలోను తనకు మరణం సంభవించ కూడదట! తథాస్తు అన్నాడు పరమేశ్వరుడు. తాను ఎవరి తలమీద చెయ్యి పెడితే వారు భస్మమై పోవాలట! అల్లాగే నాయనా అన్నాడు శంకరుడు. ఇక్కడ మనం గమనించ వలసినదేమిటంటే, మన ప్రవృత్తిని బట్టే మనకు లభించిన వరాలు మనకు ఉపయోగపడతాయి. పొరుగువాడు నాశనమై పోవాలనో, తనే ప్రపంచంలో గొప్పశక్తిగా మారి, పంచభూతాలతో సహా మొత్తం ప్రకృతిని, దిక్పాలకులని తన అధీనంలో వుంచుకుని తానే భగవంతుడిగా అయిపోవాలనో దురాశ తోను పేరాశ తోను, దుర్బుద్ధితోను జపతపాలు ఆచరించి, దుర్మార్గపు కోరికలు కోరుకుంటే, భగవంతుడు ప్రసాదిస్తాడు గాని ఆ వరాలను భక్తుడు సద్వినియోగ పరుచుకోలేడు. ఫలితంగా తన వినాశనాన్ని తానే అటువంటి భక్తుడు కొనితెచ్చుకున్న వాడవుతాడు. కనుక ముందు మనం మన స్వభావాన్ని మార్చుకోవాలి. మన వల్ల ఎవరికీ ఏవిధమైన హాని కలగకూడదని, అందరూ బాగుండాలి అని, అందరికీ మనం ఉపయోగపడాలని, నలుగురికీ సాయం చేయగలిగే అవకాశాలు మనకు రావాలని నిస్వార్థ తత్వాన్ని, ప్రేమ తత్వాన్ని, నిష్కామ భక్తిని అలవరుచుకుంటే మనం ఉద్ధరింప బడతాము. అందర్నీ ప్రేమించే తత్వాన్ని అలవర్చుకుందాము. ఆత్మస్తుతి, పరనింద, అహంకారం చాలా హానికారకమైనవి అని గుర్తుంచుకుందాము. కాకుంటే రావణాసురునికి, భస్మాసురునికి లభించిన ఫలితాలే లభిస్తాయి. చిత్తశుద్ధి లేకుండా, సాధుస్వభావాన్ని అలవర్చుకోకుండా మనం ఎన్ని అభిషేకాలు, పూజలు చేసినా అవి దుష్ఫలితాలనే ఇస్తాయి గాని మంచి ఫలితాలని ఇవ్వవు.

ఓం తత్సత్.


❖❖❖❖❖

SoftLabs® Demands Delivered
IT CONSULTING SERVICES COMPANY
TRAINING SERVICES
- SOFTWARE TESTING
- PRE SALES ANALYSIS
- BUSINESS ANALYSIS
- AGILE TRAINING
CONSULTING SERVICES
- CONTRACT MANAGEMENT
- PAYROLL MANAGEMENT
- RESOURCE MANAGEMENT
- STAFFING
CONTACT : SREENI PILLAMARRI P: 0410 756 040 | E :BUSINESS@SOFTLABS.COM.AU | W: WWW.SOFTLABS.COM.AU
SYDNEY | MELBOURNE | CANBERRA | ADELAIDE | BRISBANE | PERTH | TASMANIA

❖❖❖❖❖




❖❖❖❖❖




Designed by DSLRCREW

# సీరియల్ భయం!

-శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి, హైద్రాబాద్

టి.వి.లో 'భయం....భయం....' సీరియల్ సీరియస్ గా చూస్తోంది అయిదేళ్ళ శిరీష వాళ్ళమ్మ జయంతితో కలిసి.

'ఈరోజు అటో ఇటో తేలిపోవాల! మర్నాడు ఆడు నా కంటికి కనబడకూడదు. ఏం చేస్తావో చెయ్యి. ఇదిగో లక్షరూపాయలు. పనయ్యాక ఇంకో లక్ష. మన సేతికి మట్టంట కూడదు. ఎళ్ళు. పని గానీ.'

బొర్రమీసాల వాడు. బుగ్గన పెద్ద పుట్టుమచ్చ. గళ్ళలుంగీ. చుట్టూ నల్లటి బెల్టు. బట్టతల. లావుగా చూడటానికి భయంకరంగా, చిన్నపిల్లలు జడుసుకునేలా వున్నాడు. వాడి చేతిలో పెద్ద లావుపాటి కత్తి వుంది. రాత్రి అందరూ పడుకున్నారు. నిశ్శబ్దంగా వుంది. చిన్న బెడ్ లైట్ వెలుతురులో నెమ్మదిగా ఆ యింటి యజమాని మంచం దగ్గిరకి వచ్చాడు. ఆయన మంచి నిద్రలో వున్నాడు. వాడు కత్తి పైకి లేపాడు. ఆయనను గట్టిగా పొడవబోతుంటే............

కరెంటు పోయింది!

'ఏమే! ఇంకా పడుకోలేదా జయంతీ? పదవుతోంది. ఎల్లుండేగా మీ బాబాయి కూతురి పెళ్ళి? ఉదయమే మనం ట్రెయిన్ కి బయలుదేరాలి. బట్టలవీ సర్దావా? ఆ చెత్త సీరియల్సు నువు చూస్తున్నదే కాక పిల్లక్కూడా చూపిస్తావు. అదేమో పీడకల వచ్చిందంటూ నిద్దట్లో లేచి భయంతో కెవ్వున అరుస్తుంది. మళ్ళీ పొద్దున్న లేవాలి. కరెంటు పోతే గాని టి.వి. సీరియల్స్ చూడడం ఆపవు. శిరీ! రామ్మా, పడుకుందాం. మళ్ళీ ఉదయమే లేవాలి.' అన్నాడు తండ్రి శేఖరం.

*************************************

మర్నాడు రాత్రి పెళ్ళివారింట్లో బయట చిన్నగది వద్ద తలుపు చాటు నుంచి కళ్ళప్పగించి భయం భయంగా చూస్తోంది శిరీష.

అచ్చం రాత్రి సీరియల్ లో చూసిన వాడిలాగే నల్లగా, లావుగా, బుర్రమీసాలు, బుగ్గన నల్లటి మచ్చ, గళ్ళలుంగీ, నల్లబెల్టుతో వున్న సీరియల్ లో చూసిన అబ్బాయి క్రూరంగా చూస్తున్నాడు. ఆ సీరియలబ్బాయి ఇక్కడెందుకున్నాడో అనుకుంటూ ఏం చేస్తాడా అని భయంగా చూస్తోంది శిరీష. ఒక పక్క మంచం మీద ఎవరో పడుకున్నారు. 'అమ్మో! ఆ పడుకున్న అబ్బాయిని కత్తితో పొడుస్తాడా?'

ఆ బుర్రమీసాలతను ఇంకో చిన్నబ్బాయితో చెబుతున్నాడు, 'అదిగో, అక్కడున్న ఆ పెద్దకత్తిలా పట్రా. పదునుందా? దీని సిగ తరగ! ఇయ్యాల అటో ఇటో తేలిపోవాల! నాల్రోజుల మట్టి అమ్మగారు సెబుతావుండారు. అలాగే వస్తా అన్నాను. కత్తికి పదును లేదని రాలేదు. ఇయ్యాల కుదిరింది.'

శిరీషకి భయం ఎక్కువయింది. అచ్చం రాత్రి సీరియల్ లో చూసినట్టుగానే చేస్తున్నాడు వీడు కూడా. ఆ మంచం మీద పడుకున్న అబ్బాయిని ఏం చేస్తాడా అని భయంగా, ఆత్రంగా చూస్తోంది.....చూస్తోంది. రాత్రి సీరియల్ లో ఇలా చూస్తుంటేనే కరెంటు పోయింది. ఆఖరికేమయిందో తెలీదు.

ఇదుగో, ఇప్పుడు ఈ నల్లబ్బాయి కూడా ఒక్క దెబ్బకి అయిపోవాలంటూ, పెద్దకత్తితో ఒక్కటేసాడు.

'అమ్మా!' అంటూ భయంతో అరిచింది శిరీష. ఆ అరుపు విని ఏదన్నా కరెంటు షాకేమో అనుకుని మెట్లమీంచి వస్తూ శిరీష ఇరవయి ఏళ్ళ మావయ్య వాసు మెయిన్ ఆఫ్ చేసాడు.

హాయిగా ఓపక్క నిదరోతున్న పెంపుడుకుక్క ఎవరో కొత్తవాళ్ళొచ్చారనుకుని 'భౌ...భౌ...భౌ...' అంటూ వాళ్ళ మీద అరవటానికి వీధిగుమ్మం వైపు వెళ్ళింది.

మెట్లకింద తన పిల్లలకి పాలిస్తూ హాయిగా పడుకున్న తల్లిపిల్లి కంగారుగా తన పిల్లల మీదకెవరన్నా వస్తున్నారేమో అనుకుని 'మ్యావ్... మ్యావ్....' అంటూ అరుస్తూ చుట్టూ చూసి, 'ఏం లేదులే' అనుకుని మళ్ళీ పిల్లల దగ్గరకెళ్ళి పడుకుంది.

పక్కనే కుళాయి దగ్గర పెళ్ళికి వంటగిన్నెలు కడుగుతున్న పనమ్మాయి కంగారుగా పరిగెత్తుకు వచ్చింది, 'ఏటయినాది మావా? చెయ్యిగాని తెగ్గోసుకున్నావా? అంటూ.

పెళ్ళిపనుల హడావిడిలో వున్న శిరీష అమ్మమ్మ ఏమయిందో అనుకుని కంగారుగా వస్తూ చీకట్లో కాలు జారి పడింది.

'ఏమర్రా! కరెంటు పోయింది. టార్చ్ లైటు కొంచెం ఇలా పట్రండి. కొవ్వొత్తులెక్కడో పెట్టాను.' అని అరిచింది జయంతి పిన్ని.

'కరెంటు పోలేదు పిన్నీ. వాసుగాడు ఆ అరుపు విని ఎవరికన్నా కరెంటు షాకు కొట్టిందేమో అనుకుని మెయిన్ ఆఫ్ చేసివుంటాడు.'

' హు, వీడొకడు! మొన్న తన ఫ్రెండుకి షాక్ కొట్టిందట. అప్పట్నించీ వీడికిదో భయం. ఎవరైనా అరుస్తే మెయిన్ ఆఫ్ చేస్తాడు. ఒరేయ్ వాసూ! ఎవరికీ కరెంట్ షాక్ కొట్టలేదు గాని ముందర మెయిన్ ఆన్ చెయ్యరా నాయనా!' అంటూ తాతగారు అరిచారు.

వాసు మెయిన్ స్విచ్ ఆన్ చేసాడు.

'ఏమే శిరీషా! నువ్విక్కడున్నావా? పిల్లలందరూ అక్కడ ఆడుకుంటూంటే నువ్విక్కడేం చేస్తున్నావు? నీకోసం ఇల్లంతా వెతుకుతున్నా. ఎందుకంత గట్టిగా అరిచావు?' అడిగింది తల్లి.

'అదుగో, రాత్రి సీరియల్లో అబ్బాయి కత్తితో చంపుదామని చూస్తుంటే భయమేసి అరిచాను. నిన్న సీరియల్లో లాగే ఇక్కడా కరెంటు పోయింది.'

'శిరీ! ఆ భయం గొలిపే హింసాత్మక చెత్త సీరియల్సు చూడకే తల్లీ అంటే వినవు కదా? మీ అమ్మ పడుకుంటే గాని పడుకోకుండా, ఇద్దరూ కలిసి ఆ సీరియల్సన్నీ చూడడం....ఎవరి చేతిలోనో దిండు గాని, పాలగ్లాసు గాని, కత్తి గాని కనిపిస్తే చంపేస్తారని భయం!' అంటూ తండ్రి కూతుర్ని ఎత్తుకుని వీపు నిమురుతూ, 'భయపడకు. సీరియల్లో వాడు విలనబ్బాయయినా నిజంగా విలన్ కాదు. అదంతా నటన. ఇతనూ విలను కాడు. రేపు భోజనాలకి పనసపొట్టు కొడుతున్నాడు. చూడు కావాలంటే.' అన్నాడు.

శిరీష అటు తిరిగి చూసేసరికి, గంగులు తనకేమీ పట్టనట్టు పనసకాయ సగానికి నరికి, చెక్కు తీసి, కత్తితో పీట మీద టకటకా పనసపొట్టు సన్నగా తరుగుతున్నాడు.

గమ్మున శిరీష తండ్రి చంక దిగి గంగులు దగ్గరకెళ్ళి, 'నువ్వు సీరియల్లో అబ్బాయివి కాదా? మంచబ్బాయివేనా?' అని అడిగింది.

'కాదు చిట్టితల్లీ! పనసపొట్టు కొట్టడానికొచ్చినా. నన్నూ, నా అవతారాన్నీ చూసి భయమేసి అరిచినావా? అందరూ కంగారుగా పరిగెత్తుకొచ్చినారు.'

'ఐతే ఆ మంచం మీద పడుకున్నా అబ్బాయెవరు?' అనుమానంగా అడిగింది శిరీష.

'ఆడు మా కొడుకు. నిన్న ఇయ్యాల పెల్లి పనులు సేసి పడుకున్నాడు.'

'ఆ కత్తి తెచ్చిన అబ్బాయెవరు?'

'ఈడు నా సిన్నకొడుకు. ఎనిమిదో కళాసు సదువుతున్నాడు. ఇస్కూలుకి ఇయ్యేల సెలవే కదాని నాకు తోడు రమ్మన్నాను. అంట్లు తోమే మల్లమ్మ నా పెండ్లాం. పెల్లయ్యేదాకా పన్లు సేయడానికి ఇయ్యేల కాడినించి ఈ గదిలో వుండమన్నారు అమ్మగారు.'

అప్పుడు శిరీషకి గంగులంటే భయం పోయింది.

'అయితే గంగులంకుల్! నువ్వు మంచబ్బాయి కనక నేను నీ ఫ్రెండుని ఈ రోజు నించీ. సరేనా?'

'అలాగే బంగారూ.'

శిరీష సంతోషంగా నవ్వింది.

'ఇదుగో అమ్మా, పనసపొట్టు. రేపు డిన్నరుకి జీడిపప్పు, కరేపాకు, వడియాలూ వేసి మాంఛి రుచిగా వండించండి. ఎవరు కొట్టారో, శానా బాగా కొట్టారని అందరూ సంతోసంగా కూరంతా లాగించేస్తారు సూడండి.'

మర్నాడు నిజంగానే పనసపొట్టు కూర బ్రహ్మాండంగా వుందంటూ పెళ్ళివారు చాలా ఇష్టంగా తిన్నారు. శిరీష కూడా పనసపొట్టుకూరలో జీడిపప్పులు మాత్రమే ఏరుకు తిని, 'కూర చాలా బాగుంది.' అంది.






❖❖❖❖❖

తెలుగు బడి

Telugu Badi

# తెలుగు బడికి ఆహ్వానం

## Welcome to Telugu Language School.

| We provide: | |
|---|---|
| ➢ Caring teachers<br>➢ Personal attention | ➢ Attractive learning activities<br>➢ Outcomes based teaching |

**A great opportunity for your child to learn Telugu.**

Enrol in your nearest school today for 2019 starting on Sun, 3-Feb-2019.

| Our Schools: | | |
|---|---|---|
| | Strathfield South PS | Eastwood PS |
| | Hambledon PS (Quakers Hill) | Hornsby South PS |
| | Darcy Rd PS (Wentworthville) | Holsworthy PS |

**When:** Every Sunday from 10 am to 12 noon (during school terms)

For details, Visit: www.sydneytelugu.org
Call: 0402 169 963
Email: school@sydneytelugu.org

❖❖❖❖❖

## పాఠకుల స్పందన

డిసెంబరు నెల వాహిని అందుకున్నాను.  కృతజ్ఞతలు.

1. కార్యదర్శి నివేదిక కూడా తెలుగులో అందించేలా చూడండి.

2. తెలుగు అసోసియేషన్ వారి వైజ్ఞానిక ప్రదర్శనల తాలూకు చిత్రాలు అలరించాయి.

3. జగద్గురువుల పై శ్రీ మద్దాలి మధు గారు చక్కని వ్యాసాలను అందించారు.

4. ప్రసాద్ కట్టుపల్లి గారి ఛందస్సు పాఠాలు పద్యాలు వ్రాయాలనుకునే వారికి చాలా ఉపయుక్తంగా వుంటున్నాయి.

5. తెలుగు మహాసభల్లో శ్రీ దూర్వాసుల మూర్తి గారిని, వారి శ్రీమతి గారిని సన్మానించడం ఎంతైనా సముచితంగా వున్నది.  ఆ చిత్రాలను ప్రదర్శించిన మీకు ధన్యవాదాలు.

6. కెనడా తెలుగుతల్లి వారి పోటీలలో తన కథకు, కార్టూన్ కు, కవితకు బహుమతులు గెల్చుకుని చరిత్ర సృష్టించిన ప్రఖ్యాత రచయిత్రి శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి గారు ధనుర్మాసం సందర్భంగా  వేసిన రంగవల్లులు బాగున్నాయి.

7. తెలుగు మహాసభలలో విజయ గొల్లపూడి గారు చేసిన ప్రసంగ పాఠాన్ని వాహిని పాఠకులకు అందించారు.  చాలా సంతోషం.  వారి ప్రసంగం సమగ్రంగా వుంది.  సంగీతం, సాహిత్యం, భారతదేశపుటౌన్నత్యం మొదలుగా చాలా విషయాలను వివరంగా తెలియజెప్పారు.

8.  అమె"కారు"కూతలూ-కోతలూ కథ గిలిగింతలు పెట్టింది.  వంగూరి చిట్టెన్ రాజుగారికి అభినందనలు.

9. విజయ చావలి గారి మంచిపుస్తకం కవిత బాగుంది.

10. కాదేదీ కథకు అనర్హం అంటూ లోగడ శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి గారు 'పిన్నీసు' మీద అద్భుతమైన కథ వ్రాసేసారు.  అలాగే ఇప్పుడు 'కళ్ళజోడు' మీద వారందించిన కథ చాలా బాగుంది.

11. శ్రీ అమర్ నాథ్ జగర్లపూడి వారి వ్యాసం 'భయం వద్దు, జయమే నీ హద్దు' వ్యాసం సందేశాత్మకంగా వుంది.

మొత్తానికి మీ వాహిని డిసెంబరు సంచిక షడ్రుచుల సమ్మేళనం, నవరసాల సంగమం.  సంపాదకులకు మూడు అబినందనలు.  (ఒకటి మనసా, రెండు వాచా, మూడు కర్మణా).

ఇట్లు,

పెయ్యేటి రంగారావు, హైదరాబాద్.

❖❖❖❖❖






❖❖❖❖❖




తెలుగు అసోసియేషన్ సిడ్న



# Calendar - 2019

**Neti Sivaramakrishna Sastry** **Karra Bhaskara Sarma**

The sky around the earth is divided into twenty seven star clusters domiciled in twelve Rasis. Hindu astrological system is based on Sidereal Zodiac, alternately called 'Simsumara Chakram', 'Bhachakram' or 'Kalapurusha Chakram' in Sanskrit. Astrologically, Sun is treated as one of the seven planets despite being a Star. These planets travel clockwise whilst Rahu and Kethu, the shadowy planets move counter clockwise. Ancient sages have established the relationship between planetary movements in the sky and the way they have influenced the destiny of life on earth, besides predicting auspicious and inauspicious times that are used to perform various activities in daily life. The calendar that contains all these times is called 'panchangam' which literally refers to the five limbs in 'thidhi' (lunar day), 'varam' (day of the week), 'nakshatram' (star), 'yogam' and 'karanam'. 'Yogam' and 'karanam' are not widely used these days, hence they have been dropped in our calendar.

The two important methods in practice for calculating 'panchangam' are 'surya siddhantham' and 'druk siddhantham'. The former is very ancient whilst the latter, based on modern Astronomy is more widely used these days. Despite surya siddhantham in the older days gave more accurate planetary positions, subsequent users did not know how to adjust for natural changes through the millennia resulting in calculated planetary positions don't match the actual planetary positions in the sky. More people are therefore turning to the modern astronomical method of 'druk ganitham' or 'druk siddhantham' that allows validation of the calculated planetary positions using modern telescopes. Because of this fact, we have used 'druk ganitham' to calculate this calendar adopting the 'chitra praksha ayanamsam' that is approved by the Calendar Reform Committee, Government of India and several Astrological Bodies around the World.


The drift between vernal equinox and the diurnal equinox measured at the epoch is called 'ayanamsa'. This advances by 50.26 seconds in 12 months which is traditionally computed for the beginning of the year and is applied for the rest of the year because of the complexity involved in the manual calculations. We have calculated the 'ayanamsa' for each day in question using modern computers, thereby giving the unquestionable numerical accuracy. The 'ayanamsa' for the beginning of calendar year 2019 is at $24^0$ 13' 22".

The geo-centric positions are calculated by solving 'kepler's' equation of planetary motion and the 'sayana' or tropical positions so obtained. The 'ayanamsa' is applied to get the 'nirayana' or sidereal positions of the planets. The 'thidhi', 'nakshatram', 'varjyam' and 'adhika masam' are derived using the rules stipulated in 'siddhantha ganakanandam'.

The rules of the 'dharma sastra', 'nirnaya sindhu' are used to determine various 'parvas'/festivals according to the spread of the lunar day (thidhi) on different parts of the day/night. Thidhis are of three types. The first one is 'nitya' thidhi that is spread across the sunrise, used in 'sankalpa' for 'sandhya', 'japa', 'homa' and 'dana'. The second one is called 'parva' thidhi used for various festivals based on the spread of the thidhi on a particular part of the day applicable to the festival in question, ie. the thidhi spread across 'madhyana' (midday) determines Vinayaka Chavithi and Rama Navami while the thidhi spreading at 'nisidhi' (midnight) determines Maha Sivaratri. The third one, 'pitru' thidhi used to perform ceremonies for the departed souls ('praathi samvathsarika sraddham') is based on the 'aparahna vyapthi' spread of the thidhi on the 'aparahna' (fourth part of the day).

This Calendar (subset of the Hindu Panchangam) is calculated to the Australian Eastern Standard Time longitude ($150^0$ East of Greenwich) and is applicable to all areas where Australian Eastern Standard Time or Eastern Standard Daylight Saving Time is observed. As the sunrise and sunset times differ by longitude/latitudes, sunrise/sunset times are given only for Sydney and Melbourne in this time zone. Minor time adjustments are required for other places.

Your views and suggestions to improve this calendar in future years are highly appreciated and can be emailed to rkneti@hotmail.com or sarmakarra@hotmail.com.



# Kameswari



Computed according to Druk Siddhantham with Chitra Paksha Ayanamsa. Tidhi and Nakshtra are finishing times and Varjyam is start and finish times in Australian Eastern Standard Time (AEST)

## JANUARY 2019

**Sri Vilambi Margasirs Ba Dasami to Pushya Ba Ekadasi**

Su – Suddha Ba – Bahula/Krishna Va – Varjyam
P – Purva U – Uttara R – Raahu Kaalam
Full – Thidhi or Nakshtra spread over midnight to midnight (24 hrs) & are applicable in NSW ACT VIC

**Panchanga Kartas: Neti Sivaramakrishna Sastry (Sydney) & Karra Bhaskara Sarma (Melbourne)**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| **SUN**<br>R - 16:30 to 18:30 | **Festivals & Holidays**<br>1 – New Year's Day<br>14 - Bhogi<br>15 - Makara Sankranti<br>16 – Kanuma<br>28 – Australia Day hoiday | **6** ●<br>Ba Amavasya 12:22<br>P.Ashadha 23:15<br>Va 7:19 to 9: 5 | **13**<br>Su Shasti 3:35<br>U.Bhadra 16:37<br>Va 0:49 to 2:34 | **20**<br>Su Chaturdasi 19:45<br>Arudra 13:33<br>Varjyam Nil | **27**<br>Ba Sapthami 20:25<br>Chitra 19:52<br>Va 4:21 to 5:54 |
| **MON**<br>R - 7:30 to 9:30 | **School Holidays**<br>NSW – 1 to 28 Jan<br>VIC- 1 to 29 Jan | **7 Pushyam**<br>Su Padyami 14:43<br>U.Ashadha Full<br>Va 8:12 to 9:59 | **14**<br>Su Sapthami 5:10<br>Revathi 18:23<br>Va 5:30 to 7:13 | **21** ●<br>Su Poornima 16: 8<br>Punarvasu 10:53<br>Va 0:13 to 1:38<br>Va 17:54 to 19:19 | **28**<br>Ba Astami 19:52<br>Swathi 19:52<br>Va 1:28 to 3: 4 |
| **TUE**<br>R - 15:00 to 16:30 | **1 Margasiram**<br>Ba Dasami 6:40<br>Swathi 14:10<br>Va 20: 1 to 21:41 | **8**<br>Su Vidiya 17:17<br>U.Ashadha 2: 4<br>Va 6:36 to 8:25 | **15**<br>Su Astami 6: 7<br>Aswini 19:31<br>Va 15:19 to 17: 0 | **22**<br>Ba Padyami 12:30<br>Pushyami 7:57<br>Va 19:11 to 20:35 | **29**<br>Ba Navami 20: 1<br>Visakha 20:43<br>Va 1:40 to 3:19 |
| **WED**<br>R - 12:00 to 13:30 | **2**<br>Ba Ekadasi 6:50<br>Visakha 15:11<br>Va 19:25 to 21: 7 | **9**<br>Su Thadiya 20: 7<br>Sravanam 5:14<br>Va 9:45 to 11:33 | **16**<br>Su Navami 6:11<br>Bharani 19:44<br>Va 5:12 to 6:49 | **23**<br>Ba Vidiya 8:53<br>Aslesha 5: 1<br>Va 15:41 to 17: 6 | **30**<br>Ba Dasami 20:55<br>Anuradha 22: 8<br>Va 0:57 to 2:39 |
| **THU**<br>R - 13:30 to 15:00 | **3**<br>Ba Dwadasi 7:34<br>Anuradha 16:33<br>Va 22:34 to 0:18 | **10**<br>Su Chavithi 22:49<br>Dhanista 8:20<br>Va 16:26 to 18:15 | **17**<br>Su Dasami 5:30<br>Kruthika 19: 8<br>Va 7:26 to 9: 0 | **24**<br>Ba Thadiya 5:28<br>Makha 2:20<br>Pubba 23:53<br>Va 9:31 to 10:57 | **31**<br>Ba Ekadasi 22:23<br>Jyesta Full<br>Va 4:11 to 5:55 |
| **FRI**<br>R - 10:30 to 12:00 | **4**<br>Ba Triodasi 8:45<br>Jyesta 18:22<br>Varjyam Nil | **11**<br>Su Panchami Full<br>Satabhisham 11:22<br>Va 18:32 to 20:20 | **18**<br>Su Ekadasi 3:58<br>Rohini 17:56<br>Va 10:20 to 11:51<br>Va 23: 5 to 0:33 | **25**<br>Ba Chavithi 2:20<br>Ba Panchami 23:46<br>Uttara 21:53<br>Va 6:29 to 7:57 | **Sydney**<br>Sun Rise Set<br>1 5:48 20:06<br>8 5:54 20:08<br>15 6:00 20:07<br>22 6:07 20:05<br>29 6:14 20:01 |
| **SAT**<br>R - 09:00 to 10:30 | **5**<br>Ba Chaturdasi 10:26<br>Moola 20:42<br>Va 18:56 to 20:42 | **12**<br>Su Panchami 1:22<br>P.Bhadra 14:16<br>Varjyam Nil | **19**<br>Su Dwadasi 1:46<br>Su Triodasi 22:55<br>Mrugasira 15:59<br>Va 23:32 to 0:58 | **26**<br>Ba Shasti 21:40<br>Hasta 20:36<br>Va 5:50 to 7:21 | **Melbourne**<br>Sun Rise Set<br>1 6:02 20:44<br>8 6:08 20:44<br>15 6:15 20:42<br>22 6:23 20:39<br>29 6:31 20:34 |

bindu trikona vasu kona dasara yugmam manvasra naga dala shodasa patrayuktam |
vruttatrayam cha dharani sadanatrayam cha sri chakra raja vudithaha para devathayaha ||



AVI

AUSTRALASIAN VAULTING INDUSTRIES

SAFE DEPOSIT BOXES



Largest & Most Secure Vault
In Western Sydney

Affordable (from$22pm) - Complimentary Insurance ($10k free)
Eyelock Biometrics - Unlimited Access - 10 years Experience

VISIT US FOR A TOUR OF THE VAULT

H145, 28 Lexington Dr
BELLA VISTA

02 8326 7907

www.avivaults.com.au


Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE Initial Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au

WESTMEAD
DOCTORS



## GENERAL PRACTICE

Telugu and
Hindi speaking
Female GPs
Male GPs

## ALLIED HEALTH

Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian

## SPECIALISTS

Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist

## ONSITE PATHOLOGY

**Shop 6, Coles Complex**
**29-33 Darcy Road**
**WESTMEAD**

PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU

Open 7 days

BULK BILLING AVAILABLE

# BRAND NEW MELBOURNE APARTMENTS FOR SALE

**1 bed** from **$489,000*** | **2 beds** from **$669,000*** | **3 beds** from **$899,000***




**2018 WINNER!**
**CENTRAL EQUITY**

**HIA Victorian Apartment Complex Of The Year**

Central Equity is HIA Victoria's most Awarded Apartment Developer
2011 • 2012 • 2016 • 2018



## Prime Southbank Location

In the heart of Melbourne's Arts precinct, walk to Melbourne CBD, Crown Entertainment Complex, Royal Botanic Gardens, Flinders Street Station, restaurants, cafés, trains, trams & more. **Easy Access to RMIT & Melbourne University.**

Exclusive resident facilities: Residents' lounge, dining, landscaped BBQ terrace, indoor pool, gym, sauna, cinema, concierge & more.




**PLUS:** Melbourne House & Land in 2 suburban locations from $448,000*

**Inspect in Sydney by appointment:**
**299 Elizabeth Street, Sydney NSW 2000**

**1800 44 55 20** Multilingual staff available, many Indian languages spoken

**melbournepropertyshow.com**

*Prices as at 28/11/2018, until sold.

**CENTRAL EQUITY**
*OVER 75 PROJECTS DELIVERED AS PROMISED*

Multi-Award Winning Melbourne Developer
HIA UDIA APPA IPROPERTY